


www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

WEDNUSDAY 24TH JUNE 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 98 COST : 3\- KHAMMAM, TELANGANA

బుధవారం 24 జూన్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 98 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## పాకిస్థాన్‌పై భారత్ జయభేరి



లండన్ : ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ లండన్ అంచెలో భారత్ సత్తాచాటింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో హోరాహోరీగా సాగిన పోరులో భారత్.. 4-3తో దాయాది దేశాన్ని చిత్తుచేసింది. భారత్ తరఫున అభిషేక్ (22వ నిమిషంలో), నీలకంఠ శర్మ (24), సుఖ్‌జీత్ సింగ్ (40), రాజిందర్ సింగ్ (53) తలా ఓ గోల్ చేశారు. పాకిస్థాన్ నుంచి అహ్మద్ నదీమ్ (8), అబు మహ్మద్ (53), మోయిన్ షకీల్ (60) పోరాడినా పాక్‌ను ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయారు.

# హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

- కేంద్రమంత్రులతో సిఎం రేవంత్ చర్చలు ఫలప్రదం
- ఖట్టర్ నివాసంలో కిషన్ రెడ్డితో కలసి భేటీ
- మెట్రో రైలుపై చర్చల్లో కీలక పురోగతి



న్యూఢిల్లీ,జూన్23(అక్షరంన్యూస్) హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు భవిష్యత్తుకు సంబంధించి అత్యంత కీలకమైన అడుగు పడింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రులతో జరిపిన వరుస సమావేశాలు విజయవంతమయ్యాయి. మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, అలాగే ఫేజ్-2 విస్తరణ పనుల్లో ఉన్న అన్ని ప్రధాన ఆటంకాలు ఈ చర్చలతో తొలగిపోయాయి. మంగళవారం ఉదయం కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు ఉన్నతస్థాయి సంయుక్త సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మెట్రో విస్తరణ, నిధుల సమీకరణ, కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంపై ఈ సమావేశంలో అందరూ ఒక ఏకాభిప్రాయానికి వచ్చారు. మెట్రో ప్రాజెక్టును ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఆర్థిక సలహా సంస్థను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ ప్రధాన అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1ను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో.. దానికి సంబంధించిన అప్పులు, ఈక్విటీ విలువ రుణ సేకరణపై రోడ్ మ్యాప్ తయారు చేస్తుంది. ఫేజ్-2 కింద ప్రతిపాదించిన కారిడార్ల నిర్మాణ వ్యయం ఎంత అవుతుంది? నిధుల కోసం ఏయే అంతర్జాతీయ రుణ సంస్థలను ఎంచుకోవాలి? అనే అంశాలపై నివేదిక అందిస్తుంది. ఈ కన్సల్టెంట్ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తదుపరి అడుగులు వేస్తాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో కేందప్రభుత్వ ప్రతినిధితో పాటు తెలంగాణ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి సమన్వయ సభ్యులుగా వ్యవహరిస్తారు. కేంద్ర నిబంధనల ప్రకారం డీపీఆర్ లలో మార్పులు చేస్తూ, పనుల అనుమతుల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ పరిణామంతో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ఆమోదం లభించడం సులభతరం కానుంది. ఇది హైదరాబాద్ నగర ట్రాఫిక్ కష్టాలను తీర్చడమే కాక, భవిష్యత్తు ప్రజా రవాణా

మిగతా 2వ పేజీలో..



## ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి..

- దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలి
- తెలంగాణకు తక్షణమే డీఏపీ, యూరియా సరఫరా చేయాలి
- పప్పధాన్యాలు, నూనెగింజల కొనుగోలుపై 25 శాతం పరిమితి ఎత్తివేయాలి
- మొక్కజొన్న, జొన్నలను కేంద్రం ఎంస్‌పిపై కొనుగోలు చేయాలి
- తెలంగాణ రైతాంగ ప్రయోజనాల కోసం కేంద్రానికి వినతులు
- కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్

న్యూఢిల్లీ,జూన్23(అక్షరంన్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెల ఉత్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్ లక్ష్యాలను

మిగతా 2వ పేజీలో..

## నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

- హిందీ మనకు అసవరం లేదు
- తమిళం, ఇంగ్లీస్ సరిపోతుంది
- కుటుంబ పార్టీలకు తాము వ్యతిరేకం
- ప్రజలంతా తమ కుటుంబమనే భావనతో పాలన
- ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఇక్కడికి వచ్చా
- ప్రజల సంపూర్ణ మద్దతుతో అధికారం చేపట్టాం
- కరూర్ తొక్కిసలాట ఘటన మరచిపోలేని విషాదం
- అసెంబ్లీలో సిఎం విజయ్ కీలక ప్రసంగం



చెన్నై,జూన్23 తమిళనాడు విద్యార్థుల్లో నీట్ అసమానతల్ని సృష్టిస్తోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ అన్నారు. అసమానతలకు కారణమైన నీట్‌ను వెంటనే

మిగతా 2వ పేజీలో..

## లక్ష ప్లాట్ల పథకానికి పేరు సూచించండి

- లక్ష రూపాయల బహుమతి అందుకోండి
- క్యూర్ ఏరియాలో లక్ష ప్లాట్ల నిర్మాణం



- ఎల్ ఐ జి హౌసింగ్ స్కీం - పేరు ఖరారుపై పోటీ
- ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో నిర్వహణ
- ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి రూ.లక్ష బహుమతి
- హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం

2వ పేజీలో..

## పాఠశాలలు, అంగన్‌వాడీలకు నిరంతర నీటి సరఫరా

- స్వచ్ఛ భారత్ మిషలన్ లక్ష్యాలపై కీలక సూచనలు
- అధికారలుతో అభివృద్ధి, సంక్షేమాలపై మంత్రి సీతక్క సమీక్ష



2వ పేజీలో..

## ఇందిరమ్మ రాజ్యమంటూ పేదల ఇళ్ల కూల్చివేత

- పేదల ఇళ్లను లాక్కుంటున్న రెవెన్యూ మంత్రి
- ఖమ్మం జర్నలిస్టులు ఏం పాపం చేశారు...వారికి ఇళ్లేవి
- ఖమ్మం పర్యటనలో మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

ఖమ్మం,జూన్23 సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ఇందిరమ్మ రాజ్యమంటూనే పేదల ఇళ్లు కూలగొడుతోం దని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వమైనా పేదలకు అండగా నిలిచి వాళ్లకు గూడు కట్టిస్తుందని తెలిపారు. రెవెన్యూ మంత్రి హయాంలో పేదల ఇళ్లు లాక్కోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లాలో హరీశ్‌రావు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మం కలెక్టర్‌తో మాట్లాడి పేదల గూడు లాక్కుంటే ఊరుకోమని చెప్పామని అన్నారు. ఎవరి స్థలాలు అయితే లాక్కున్నారో.. వారికి వెంటనే స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే తానే పోరాడుతానని స్పష్టం చేశారు. తాను దగ్గరుండి ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానని భరోసా కల్పించారు. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు

మిగతా 2వ పేజీలో..

## ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం



- పద్మభూషణ్ అందుకున్న నటుడు మమ్ముట్టి
- పద్మశ్రీలు అందుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్
- కార్యక్రమంలో ప్రధాని మోడీ తదితరుల హాజరు

న్యూఢిల్లీ,జూన్23 (అక్షరంన్యూస్)రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు ఈ గౌరవాలను అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించింది. అలాగే ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. క్రికెటర్ రోహిత్ శర్మకు కూడా పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి అందజేశారు. ప్రఖ్యాత మలయాళ పాత్రికేయుడు పి.నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేటీ థామస్ పద్మవిభూషణ్ అందుకోగా..

మిగతా 2వ పేజీలో..

## నీట్‌తో విద్యార్థుల్లో గందరగోళం

రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా హిందీ వివాదం, నీట్, కరూర్ తొక్కిసలాట ఘటన వంటి పలు అంశాలను ప్రస్తావించిన విజయ్ విమర్శకులకు గట్టిగా బదులిచ్చారు. ఈ మేరకు అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాషనూ వ్యతిరేకించారు. తమిళం, ఇంగ్లీష్‌లతో కూడిన ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉంటామన్నారు. నీట్ వల్ల సామాజిక అసమానతలు పెరుగు తున్నాయని సీఎం విజయ్ చెప్పుకొచ్చారు. విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడి తెస్తున్న ఈ పరీక్షను రద్దుచేసి, ఇంటర్ మార్కుల ఆధారంగా వైద్య సీట్లను కేటాయించాలని తమిళనాడు చాలా కాలంగా కోరుతోందని ఆయన గుర్తుచేశారు. హిందీ భాషపైనా స్పందిస్తూ.. తమిళం రాష్ట్ర భాషగా, ఇంగ్లీష్ అంతర్జాతీయ భాషగా సరిపోతాయని తన వైఖరిని స్పష్టం చేశారు. మూడో భాషను బలవంతంగా రుద్దాల్సిన అవసరంలేదని, రెండు భాషల విధానమే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. తమ పార్టీని విమర్శించే వారికి ఈ సందర్భంగా గట్టిగా సమాధాన మిచ్చారు సీఎం విజయ్. ప్రజల మద్దతుతోనే తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధికారంలోకి వచ్చిందన్న ఆయన.. దీని వెనుక ఎన్నో కుట్రలు, సవాళ్లను ఎదుర్కొ న్నామన్నారు. 'జనం గుండెల్లో స్థానం సంపాదించడం అంత సులువు కాదు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే ఇక్కడకు వచ్చాం. అయినప్పటికీ కొందరు 'నటుడి పార్టీ' అనే విమర్శలు గుప్పిస్తున్నారు. వాటన్నింటినీ మేం పట్టించుకోం. మా రాజకీయాలు పారదర్శకంగా ఉంటాయని విజయ్ చెప్పుకొచ్చారు. అలాగే కుటుంబ రాజకీయాలపై ఆయన మాట్లాడుతూ.. 'మా రాజకీయాలు ఒక్క కుటుంబం కోసమే కాదు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం మాదే. అదే మా పాలన.. అదే మా లక్ష్యం' అని స్పష్టం చేశారు. ఎన్నో సవాళ్లను దాటి తాము అధికారంలోకి వచ్చామని, నటుడి పార్టీ అని తమను ఎంతోమంది ఎగతాళి చేశారని గుర్తుచేసుకున్నారు. మాకు ఈ అధికారం అంత సులువుగా వచ్చింది కాదు. తమిళనాడు ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు నేను, నా పార్టీ ఎన్నో కుట్రలు, సవాళ్లను అధిగమించాల్సి వచ్చింది. మాది యాక్టర్ పార్టీ అని, నేను సినిమా షూటింగ్ నుంచి నేరుగా సీఎం కుర్చీలో కూర్చున్నానని చాలా మంది గేలి చేశారు. అలాంటి విమర్శలు నేను పట్టించుకోను. సాధారణంగా చాలా మంది రాజకీయ పార్టీ పెట్టి ప్రజల్లోకి వెళ్తారు. కానీ, నేను ప్రజల్లోకి వెళ్లిన తర్వాత పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేశా. నాపై నమ్మకం ఉంచి ప్రజలు గెలిపించారని విజయ్ అన్నారు. తమిళనాడులో ద్విభాషా విధానానికే తాము కట్టుబడి ఉన్నట్లు సీఎం పునరుద్ఘాటించారు. హిందీ భాషను రుద్దేందుకు కేంద్రం చేస్తోన్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రసంగంలో భాగంగా ఎన్నికల ప్రచార సమయంలో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనను విజయ్ ప్రస్తావించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఆ విషాద ఘటన నన్ను ఎంత వేదనకు గురిచేసిందో మాటల్లో చెప్పలేను. ఆ బాధ నన్ను ఎన్నటికీ వదలదు. ఆ ఘటన విషయం లోనూ మాపైనే నిందలేశారు. ఇది అత్యంత దారుణం. రాజకీయాలు ఇంత క్రూరంగా ఉంటాయా అని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాల గురించి స్పందిస్తూ డీఎంకేపై విజయ్ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. డీఎంకేను ఉద్దేశిస్తూ కేవలం ఒక కుటుంబానికే ప్రాధాన్యమివ్వడం మా రాజకీయ విధానం కాదు. తమిళనాడులోని ప్రతి కుటుంబానికి మా సేవలంది స్తాం. అదే మా రాజకీయం. అదే మా పాలనా విధానమని విజయ్ పేర్కొన్నారు.

## జంటహత్యల కేసులో విస్తుపోయే విషయాలు

మెదక్,జూన్23: మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సురారం గ్రామంలో తీవ్ర కలకలం రేపిన జంట హత్యల కేసులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. గతంలో ప్రాణ స్నేహితులైన శ్రీధర్, ప్రభు (ప్రభాకర్) మధ్య ఉన్న చిన్నపాటి ఆర్థిక వివాదం, ఆపై కుటుంబ గొడవలే ఈ దారుణ హత్యలకు దారితీశాయి. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. శ్రీధర్, ప్రభు గతంలో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ప్రభు బంధువుల నుంచి శ్రీధర్ ఒక ఆటోను ఈఎంఐ పద్ధతిలో తీసుకున్నాడు. అయితే, రెండు నెలల ఈఎంఐ బకాయిల విషయంలో వీరిద్దరి మధ్య గొడవ మొదలైంది. ఈ క్రమంలోనే గతంలో ప్రభు.. శ్రీధర్‌పై హత్యాయత్నానికి కూడా పాల్పడగా, అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ గొడవ ఇలా ఉండగానే, శ్రీధర్‌కు వరుసకు చెల్లెలు అయ్యే అమ్మాయిని ప్రభు రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు, పగ మరింత తీవ్రరూపం దాల్చాయి.

ఈ వివాదాలను పరిష్కరించుకోవడానికి ఇద్దరూ ఒకచోట కలుసుకుని మాట్లాడుకుందామని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఒకరికొకరు లొకేషన్లు షేర్ చేసుకున్నారు. ఈ క్రమంలో చేగుంట మండలం అనంతసాగర్ వద్దకు శ్రీధర్ బైక్‌పై రాగానే.. అప్పటికే పథకం ప్రకారం అక్కడ వేచి ఉన్న ప్రభు, అతని స్నేహితులు ఆటోతో శ్రీధర్ బైక్‌ను బలంగా ఢీకొట్టారు. అనంతరం శ్రీధర్‌ను దారుణంగా హతమార్చి అక్కడి నుంచి పరారయ్యారు. కన్నకొడుకు శ్రీధర్ హత్యకు గురయ్యాడనే విషయం తెలవడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ప్రతీకారంతో రగిలిపోయారు. ప్రభుపై కక్షతో అర్ధరాత్రి వేళ అతని తండ్రి యాదగిరిని టార్గెట్ చేసి దారుణంగా హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు యాదగిరి మృతదేహాన్ని మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామ శివారులోని హల్దీవాగులో పడేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. శ్రీధర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, హల్దీవాగు నుంచి వెలికితీసిన యాదగిరి మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ జంట హత్యల నేపథ్యంలో సురారం గ్రామంలో మళ్లీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## ఇందిరమ్మ రాజ్యమంటూ పేదల ఇళ్ల కూల్చివేత

ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారని అన్నారు. మరి ఖమ్మం జర్నలిస్టులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఖమ్మం జర్నలిస్టులకు ఎందుకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లేదని నిలదీశారు. ఖమ్మంలో పేదల ఇళ్లు లాక్కుంటే చూస్తూ ఊరుకోమని.. ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి తనకు హిట్లర్ ఆదర్శమని చెప్పి హైడ్రా పెట్టారని ఎద్దేవా చేశారు. ఆయనకు కళ్లు నెత్తికెక్కాయని.. అహంకారాన్ని ప్రదర్శించే వాళ్లే హిట్లర్‌ని ఆదర్శంగా తీసుకుంటారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి పాలనంత బ్లాక్‌మెయిల్ పాలన అయిపోయిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో కనీసం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని దుస్థితి ఉందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

## హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు గ్రీన్ సిగ్నల్

వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేంద్రమంత్రి ఖట్టర్ నివాసంలో దాదాపు 40 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. మెట్రో ప్రాజెక్టుకు అప్పులు, రెండో ఫేజ్‌కు అనుమతులు, నిధులు కావాలని సీఎం రేవంత్ కోరినట్లు సమాచారం. సమావేశంలో సీఎస్ రామకృష్ణ రావు, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే ఉన్నారు. కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడుపు తున్నారు. ఇప్పటికే ఢిల్లీలో ఉన్న మంత్రి శ్రీధర్ బాబు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిశారు. అలాగే, తెలంగాణ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని ఇరువురు మంత్రులు కలవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరనున్నారు. అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో సమావేశమై.. యూరియా సరఫరా పెంచాలని మంత్రులు ఉత్తమ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేయనున్నారు.

## బాసర సరస్వతీ ఆలయంలో చోరీ

నిర్మల్,జూన్23 బాసరలో కొలువుదీరిన జ్ఞాన సరస్వతి దేవి ఆలయంలో భారీ చోరీ జరిగింది. మొదటి అంతస్తులోని మహంకాళి అమ్మవారి ఆలయంలో తలుపు తాళాలు దొంగలు పగలకొట్టి అమ్మవారి వెండి కిరీటంతోపాటు హుండీని దొంగిలించారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం చేసేందుకు దేవాలయంలోకి పురోహితులు వెళ్లారు. అమ్మవారి ఆలయంలో చోరీ జరిగిన విషయాన్ని వారు గుర్తించారు అనంతరం దేవస్థానం అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సరస్వతి అమ్మవారి ఆలయంలోని పై అంతస్తులో ఉన్న మహంకాళి అమ్మవారి వెండి కిరీటంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి మరీ ఈ దోపిడీకి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గుడికి వచ్చిన సందర్భంగా తాళాలు పగులగొట్టి ఉండటం గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ భద్రతా సిబ్బందికి సమాచారం అందించారు. ఆలయ భద్రతా సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆలయ పూజారి చేత తలుపులు తెరిపించారు. ఆ సమయంలో అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు పోలీసులు గుర్తించారు.కాగా, సీసీ కెమెరాలపై వస్త్రాలు కప్పి దొంగలు ఆలయంలోకి ప్రవేశించినట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. చోరీకి పాల్పడిన హుండీలో నుంచి డబ్బులు తీసుకుని, తర్వాత హుండీని వ్యాసగుడి సమీపంలో పడేసినట్లుగా పోలీసులు గుర్తించారు. బాసర ఆలయంలో చోరీ గురించి సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఘటనాస్థలిని పరిశీలించారు. చోరీ జరిగిన తీరు, సేకరించిన ప్రాథమిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల పరిశీలన తదితర అంశాలపై అధికారులతో సమావేశమయ్యారు. కేసును అన్ని కోణాల్లో విచారించి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## పాఠశాలలు, అంగన్‌వాడీలకు నిరంతర నీటి సరఫరా

హైదరాబాద్,జూన్23: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతర నీటి సరఫరా ఉండాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలంలో తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలపై మంత్రి సీతక్క రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలతో మంత్రి సమావేశమయ్యారు. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్ మెటీరియల్ బిల్లుల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, జీపీ కార్యాలయాల నిర్మాణాలపై సమీక్షించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణాలపై అధికారులతో మంత్రి చర్చలు జరిపారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎమ్‌కేఎస్‌వై) పనుల అమలుపై మంత్రి సమీక్ష జరిపారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరుపై సీతక్క ఆరా తీశారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై చర్చించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైనా సమీక్ష చేశారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులపై పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష చేశారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంక్ లింకేజీల పెంపుపై సెర్ప్‌తో చర్చించారు. మహిళల జీవనోపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి పథకం అమలు కావాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అలాగే, గ్రామ స్థాయిలో భూగర్భ జలాలు పెంచే విధంగా 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

## ఘనంగా పద్మపురస్కారాల ప్రదానం

సినీ రంగ ప్రముఖులు మమ్ముట్టి, అల్కా యాగ్నిక్‌తో పాటు ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్ పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సినీ నటులు మాగంటి మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు. అలాగే, వీరితో పాటు సినీనటుడు మాధవన్, క్రికెటర్ రోహిత్ శర్మ, పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత గణతంత్ర దినోత్సవం వేళ కేంద్రం మొత్తం 131 మందికి పద్మ పురస్కారాలకు ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో 66 మందికి అందజేయగా.. మిగతా వారికి మంగళవారం ప్రదానం చేశారు. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించాలి..

అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఔఓఇక్ష-క్షఖ కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు. దీర్ఘకాలిక పంట అయిన ఆయిల్ పామ్ సాగుకు రైతులు భారీగా పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో ధరల అనిశ్చితి రైతుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచడం ద్వారా దేశీయ ఆయిల్ పామ్ రైతులకు రక్షణ కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన ఆత్మనిర్భర్ భారత్, ఎడిబుల్ ఆయిల్ స్వయం సమృద్ధి లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని మంత్రులు పేర్కొన్నారు. అలాగే ఆయిల్ పామ్ రైతులకు కనీస గ్యారంటీ ధర విధానాన్ని అమలు చేసే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని కోరారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఆయిల్ పామ్ రైతుల భవిష్యత్తు దృష్ట్యా దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించి రైతులకు భరోసా కల్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని మంత్రులు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. రాష్ట్రంలో ఈ ఏడాది వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డి.ఎ.పి, యూరియా ఎరువుల అవసరం గణనీయంగా పెరిగిందని, కేంద్రం కేటాయించిన కోటాకు మరియు వాస్తవ సరఫరాకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వెంటనే పూడ్చి, రాష్ట్రానికి పూర్తి స్థాయిలో ఎరువులు అందించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఎరువుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోళ్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం పరిమితి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన మొత్తం పంటను కనీస మద్దతు ధర (ఓ÷ూఖ) కింద కొనుగోలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుని ఆ పరిమితిని పూర్తిగా తొలగించాలని కోరారు. దీంతో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు దేశ ఆహార భద్రత, దిగుమతుల తగ్గింపుకు కూడా దోహదపడుతుందని వివరించారు. ఏడాది తెలంగాణలో రికార్డు స్థాయిలో సుమారు 15 లక్షల టన్నుల మొక్కజొన్న, 3 లక్షల టన్నుల జొన్నల ఉత్పత్తి నమోదైందని, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే దిగువకు పడిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భారీ ఆర్థిక భారం భరించి మొక్కజొన్న, జొన్నలను కొనుగోలు చేసిందని, ఈ పంటలను కూడా కేంద్ర ప్రభుత్వ కొనుగోలు విధానంలో చేర్చి ఓ÷ూఖపై సేకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రసాయనాలు-ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు తెలంగాణలో ఎరువుల సరఫరా, పోషకాధారిత ఎరువుల సబ్సిడీ విధానంలో మార్పులకు సంబంధించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల పలు లేఖలు రాయగా... ఈ వినతులపై స్పందించిన కేంద్ర మంత్రి తెలంగాణలో యూరియా, డి.ఎ.పి. తదితర ఎరువుల లభ్యత, సరఫరాపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, రాష్ట్ర రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను ఆదేశించినట్లు తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలపై కేంద్రం సానుకూలంగా స్పందించడం రైతాంగానికి ప్రయోజనకరంగా మారుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సమావేశాలలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్ ల వెంట ఎంపిలు రఘువీర్ మరియు కొండ విశ్వేశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు.

## రేవంత్ కోరారు..కేంద్రమంత్రులను కలిసాం

### ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ,జూన్23 ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, మంగళశారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో రేవంత్ సమావేశమయ్యారు. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 విస్తరణపైనే చర్చ జరిగింది. రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడంపై కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు.'కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండుసార్లు నాకు లేఖ రాశారు. 22వ తేదీన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో, 23వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయించాను. మెట్రో రైల్ విస్తరణపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్ మంత్రిగా ఉన్న నేను రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎల్లవేళలా పనిచేస్తా' అని ఎక్స్‌లో కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## లక్ష ప్లాట్ల పథకానికి పేరు సూచించండి

హైదరాబాద్,జూన్23 తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా అల్పాదాయ వర్గాలకు క్యూర్ ఏరియాలో ప్రతిపాదించిన లక్ష ప్లాట్ల నిర్మాణ పథకానికి పేరు ఖరారునకు హౌసింగ్ బోర్డు వినూత్న ప్రయత్నం చేపట్టింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకానికి మంచి పేరును నేరుగా ప్రజల నుంచే స్వీకరించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ప్రజల నుంచి వచ్చిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన పేరును సూచించిన వారికి ఒక లక్ష రూపాయల బహుమతిని అందచేస్తామని, సోషల్ మీడియా వేదికగా ఈ అంశంలో బహిరంగ పోటీని నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. క్యూర్ పరిధిలో అల్పాదాయ వర్గాల ప్రజల కోసం ప్రత్యేకంగా లక్ష ఇండ్లను నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంతర్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఎటువంటి వివాదాలు లేకుండా, అందుబాటులోని ధరల్లో వివిధ వర్గాల ప్రజల సొంత ఇంటి కలలను నెరవేర్చడంలో హౌసింగ్ బోర్డుకు మంచి పేరు ఉంది. అంతే కాకుండా బోర్డు ఆధ్వర్యంలో చేపట్టి ప్రాజెక్టులకు ప్రజల నుంచి ఆదరణ తో పాటు డిమాండ్ కూడా ఉన్నదని ఆయన గుర్తు చేశారు.

నేపథ్యంలో సుదీర్ఘం కాలం తరువాత చేపడుతున్న ప్రాజెక్టులో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలన్న ఆలోచనతో, ప్రజల నుంచి అందే సూచనల తోనే ఈ పథకానికి పేరును కూడా ఖరారు చేయాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28 వరకు సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన పోటీని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సూచించిన పేర్లలో ఉత్తమమైనదిగా ఎంపికైన దానికి లక్ష రూపాయలను బహుమతిగా ఇస్తామన్నారు. క్యూర్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎల్ ఐజి ఎ÷-లాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని, ఇందుకు అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఇందుకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, లాటరీ పద్ధతిలో ఇండ్లను కేటాయిస్తామని, పూర్తి విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

## రేషనలైజేషన్‌కు వ్యతిరేకంగా ఎబివిపి పాఠశాలల బంద్ విజయవంతం



సూర్యాపేట/నేరేడుచర్ల/ జూన్ 23 (అక్షరం న్యూస్ )

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేరేడుచర్ల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రేషనలైజేషన్ పేరిట రాష్ట్రములో 24 వేల పాఠశాలను ముసి వేతను నిరసిస్తూ ఎబివిపి రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ లో భాగంగా బంద్ విజయవంతం కావటం జరిగిందని ఎబివిపి నాయకులు కొప్పు లోకేశ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలలో అధికంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మరియు విద్యార్థులను తీవ్ర మనోవేదన గురిచేస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలో 23 వేల పాఠశాలలను మూసివేసే కుట్ర ను తక్షణ ఉపసంహరించుకోవాలి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలినీ ఖాళీగా ఉన్న ఎంఈఓ డీఈవో పోస్టులను మరియు టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టల్ వెంటనే భర్తీ చేయాలి గురుకులాల పాఠశాలకు పక్కా భవనాలు నిర్మించాలని చీజూ 2020 వెంటనే అమలు చేయాలినీ ప్రవేటు కార్పోరేట్ పాఠశాలలో 25% సీట్లను పేద విద్యార్థుల కేటాయించాలని మరియు విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది లేని పక్షంలో రాబోవు రోజుల్లో ప్రభుత్వనికి వ్యతిరేకంగా ఎబివిపి భారీ ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి శ్రీను పండు , మన్నెం గౌతమ్ , అవినాష్ తదితరులు పాల్గొన్నారు



## వాయుపుత్రుడికి వైభవంగా పంచామృతాభిషేకం...



సూర్యాపేట/నేరేడుచర్ల జూన్ 23 (అక్షరం న్యూస్ )

నేరేడుచర్ల లోని శ్రీ కోదండ రామాలయంలో కొలువైన వాయు పుత్రుడు ఆంజనేయస్వామికి మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకాలు చేశారు, ఆలయ పూజారి కొలచిన దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఆవు నెయ్యి, ఆవు పాలు, ఆవు పెరుగు, తెనే పంచదార , గంధం, వివిధ రకాల పండ్లతో అభిషేకాలు చేసి, వేద మంత్రాలతోఆకు పూజ, పుష్పార్చన పూజలు చేశారు, ఆంజనేయ స్వామిని పూలమాలలతో పూలతో తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు, ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, పులిజాల వెంకటరమణరావు, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, తాటికొండ వెంకటరెడ్డి, చింతకుంట్ల శ్రీనివాసరావు, మాశెట్టి సైదయ్య, పొనుగోటి జంగారావు జెట్టి వెంకన్న, కాంపల్లి నారాయణరెడ్డి, గజవెల్లి వెంకటేశ్వర్లు, కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, లచ్చిరెడ్డి, సైదిరెడ్డి, మొగిలి చర్ల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



# ప్రకృతి వ్యవసాయమే రైతు భవిష్యత్తుకు బంగారు బాట





సూర్యాపేట /గరిడేపల్లి /జూన్ 23 (అక్షరం న్యూస్ )

కృషి విజ్ఞాన కేంద్రం, గడ్డిపల్లి భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో "కేత్ బచావో అభియాన్" కార్యక్రమం లో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం మంగళవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చల్ల శ్రీలత రెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కే.వి కే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త అండ్ హెడ్ ఇంచార్జి డి.నరేష్ మాట్లాడుతూ రైతులు పొలం సంరక్షణ, మిశ్రమ పంటల సాగు, జీవన ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధానాలను రైతులు అవలంబించాలని పిలుపునిచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు,వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గోలి మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాలని రైతులకు సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. జిల్లా బీజేపీ అధ్యక్షులు చల్ల శ్రీలత రెడ్డి గారు రైతులను ఉద్దేశించి ఆధునిక, ప్రకృతి ఆధారిత సాగు విధానాలపై అవగాహన కల్పించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్వత అశోక్ రెడ్డి మాట్లాడుతూ చీడపీడల నివారణకు ఉపయోగపడే వివిధ రకాల సహజ కషాయాల తయారీ విధానాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డీ నరేష్, సిహెచ్ నరేష్, ఎ.కిరణ్, డాక్టర్ పి. అక్షిత్ ఎన్.సుగంధి, ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి, కంచర్ల నరసింహారెడ్డి కనువింత రెడ్డి అశోక్ రెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ, చిలుకూరు రమేష్, చిట్టిబాబు, మంజూల, కుంకడ వెంకటేశ్వర్లు, చందా సుధాకర్ రెడ్డి, ఎడవల్లి చంద్రశేఖర్ రెడ్డి ల, సంతోష్ రెడ్డి, అజయ్ కుమార్ రెడ్డి, శోభ, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, రైతు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం...





- **విజయవంతంగా విత్తన మేళా...**

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల జూన్ 23( అక్షరం న్యూస్ )

నేరేడుచర్ల మండలంలో గల దిర్శించర్ల రైతు వేదిక నందు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చే నిర్వహించబడుతున్న రైతు వేదికలలో విత్తనమేల అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రైతులకు వివిధ రకాల విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రైతులకు పంట మార్పిడి, సన్న వడ్ల రకాల సాగు నీ ప్రోత్సహించడం, వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులు వాటి యొక్క ప్రోత్సహకాలు, కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ రకాల పథకాల గురించి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ , మాజీ చైర్మన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచి, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు హిమబిందు త్రివేణి, విత్తన కంపెనీ డీలర్లు, ఫర్టిలైజర్ డీలర్లు తదితరులు పాల్గొనడం జరిగినది.





# ముల్కనూరులో విత్తన మేళా ప్రారంభం





- **రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో..**
- **మండల వ్యవసాయ అధికారి పద్మ..**

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 23/అక్షరం న్యూస్:–

వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విత్తన మేళా మంగళవారం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు రైతు వేదికలో ప్రారంభమైంది.



ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పద్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), రైతులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జూన్ 23 నుంచి జూన్ 29 వరకు నిర్వహిస్తున్న ఏడు రోజుల విత్తన మేళాలో భాగంగా ముల్కనూరులో ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ముల్కనూరు సహకార సంఘం, టీజీ సీడ్స్, ప్రైవేట్ విత్తన డీలర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో రైతులకు అవసరమైన వివిధ రకాల విత్తనాలు అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం ప్రకటించిన ఏడు రకాల సన్న వరి విత్తనాలతో పాటు పప్పు దినుసులు నూనెగింజల పంటలు, కూరగాయల విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు కూడా రైతు వేదికలో అందుబాటులో ఉంచినట్లు స్థానిక సంర్పచ్ ప్రమోద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పద్మ మాట్లాడుతూ రైతులు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన విత్తనాలు ఎరువులను రైతు వేదికల ద్వారా పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతు ప్రతినిధులు, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- ఎస్సై డి నరేష్



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూన్ 23:
విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవడానికి దురలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ డి.నరేష్ అన్నారు. మండలంలోని ఖిలాషాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న యువత అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన, పెయిం టింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భారత రవిందర్, ఉపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పంచాక్షరీ, ప్రవీణ్ కుమార్, శ్రీ నివాస్, హెడ్ కానిస్టేబుల్ పోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలి

- తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షానూర్ బాబా.



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 23 / : మంగళవారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లాలోని వివిధ మండలాలో నెలకొన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు , జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ షానూర్ బాబా ప్రభుత్వాన్ని కోరారు.

భువనగిరి పట్టణంలో వందన కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రభుత్వమైనా జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను పరిష్కరించి ఇడ్ల పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టులకు సొంత ఇండ్లు లేక అద్దె ఇండల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి జె ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగరాజు,కదిర్, భువనగిరి మండల కార్యదర్శి అల్తాఫ్, గుండాల అధ్యక్షులు నరేష్, మోత్కూర్ అధ్యక్షులు నర్సింహా, అడ్డగూడూర్ అధ్యక్షులు సందీప్, తుర్కపల్లి కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట బీసీ కాలనీలో మొహరం పండుగ వేడుకలు



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 23 / :యాదగిరిగుట్ట బీసీ కాలనీలో మొహరం పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించిన కమిటి సభ్యులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న యాదగిరిగుట్ట మాజీ దేవస్థానం ధర్మకర్త పెలిమెల్లి శ్రీధర్ గౌడ్ యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ వాణి భరత్ గౌడ్ కౌన్సిలర్ మల్లేష్ యాదవ్ యాదగిరిగుట్ట టౌన్ మాజీ అధ్యక్షులు బంధారపు బిక్షపతి గౌడ్ మాజీ చైర్మన్ ఎరుకల సుధా కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు బండారి హరిప్రసాద్ కమిటీ సభ్యులు గడ్డం చంద్రం గౌడ్ గుండు నరసింహ గౌడ్ కాటబత్తిని మహేష్, గౌస్ చోటు ఇమ్రాన్ కోట కరుణాకర్ ఎల్లా గౌడ్ నాగరాజు నవీన్ గాదపాక చింటూ గుండు మధు శ్యామ్ మనీ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## ఆక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

జనగామ జిల్లా/రఘునాథపల్లి,/( అక్షరం న్యూస్ ) జూన్ 23: ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు పట్టుకొని మంగళవారం సీజ్ చేశారు. మండలంలోని కోమల్ల వాగు నుండి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకు ండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న యాట హృషికేష్ కు చెందిన ట్రాక్టర్ ను సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన అవగాహన సదస్సు..





- హాజరైన జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్...
- యువత దేశాభివృద్ధికి ఉపయోగపడే వనరులు, అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి - ఎస్పీ నరసింహ ఐపీఎస్.
- డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాల నివారణ, రోడ్డు ప్రమాదాల నిర్మూలనలో యువత, విద్యార్థులు అంబాసిడర్ గా ఉండాలి.
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం ముఖ్యం.
- యువత వ్యసనాలకు గురికావద్దు.
- లక్ష్యం కోసం కృషి చేయాలి.
- గొప్ప వ్యక్తుల జీవితాలు ఆదర్శంగా, ఇన్స్పిరేషన్ గా తీసుకోవాలి.
- ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధన చేయాలి.

సూర్యాపేట జిల్లా/కోదాడ/ అనంతగిరి/జూన్ 23(అక్షరం న్యూస్ )
మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం జూన్ 26 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఈగల్ ఫోర్స్ ఉత్తర్వుల మేరకు సూర్యాపేట జిల్లా పోలీసుల అధ్వర్యంలో వారం రోజుల పాటు డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనంతగిరి మండల పరిధి అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల నందు విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలన పై పోలీసు ల ఆధ్వర్యంలో అవగాహన కల్పించి ఉజ్వల భవిష్యత్తుపై అ న ు స రి ం చా ల్సి న విధివిధానాల పట్ల చైతన్యపరిచారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు నేటి యువత దేశాభివృద్ధికి పాటుపడే వనరులుగా ఎదగాలని ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకై నిరంతరం కృషి చేయాలని కోరారు. గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా, ఇన్స్పిరేషన్ గా తీసుకోవాలి, సమాజానికి ఉపయోగపడే వనరు కావాలి, ఇష్టం ఉన్న, నైపుణ్యం ఉన్న రంగంపై దృష్టి పెట్టాలి, గొప్ప శాస్త్రవేత్తలు, గొప్ప లీడర్స్ కావాలి అని ఎస్పి విద్యార్ధులను చైతన్య పరిచారు. యువత, విద్యార్థులు దేశ సంపద, దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నది కావున విద్యార్థుల్లో, యువతలో మార్పు రావాలి, డ్రగ్స్ నిర్మూలన కోసం బాధ్యతగా ఉండాలి అని కోరారు. డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి, డ్రగ్స్ కు అలవాటుపడ్డ వారు నేరాలకు పాల్పడుతున్నారు, అనారోగ్యాలకు గురౌతున్నారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కళాశాలలో యాంటీ డ్రస్ టీమ్స్ ఏర్పాటు చేశాము, విద్యాసంస్థల్లో ఈ టీమ్స్ డ్రగ్స్ నిర్మూలనకు పని చేయాలి, అధికారులకు సమాచారం అందించాలి అన్నారు. సమాజంలో చెడ్డపేరు వస్తుంది అన్నారు. ఇది మన దేశ యువ శక్తిని నిర్వీర్యం చేస్తుంది అన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా, సరఫరా చేయడం తీవ్రమైన నేరం అన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడిన విద్యార్థులు, యువత గురించి సమాచారం ఇవ్వండి వీరికి కౌన్సిలింగ్ ఇస్తాము, వీరిలో మార్పునకు కృషి చేస్తాము అన్నారు. మన సమాజంలో డ్రగ్స్ లేకుండా నిర్మూలించడం మన అందరి బాధ్యత అన్నారు. సమాజంలో డ్రగ్స్ ను నిర్మూలించడంలో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలి, డ్రగ్స్ కు దూరంగా ఉండాలి అని అన్నారు. సైబర్ నేరాలు అనేవి ఇప్పుడు సమాజంలో మరో పెద్ద సమస్య అని అన్నారు, సైబర్ నేరగాళ్లు ఉచితాలు ఆశలు చూపి ఆర్థికంగా నష్టపరుస్తారు, ఓటీపీలు, పిన్ నంబర్స్ చెపితే బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు పోతాయి అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ లో సంప్రదిస్తే వ్యక్తిగత వివరాలు చెప్పవద్దు అని ఎస్పి కోరారు. ప్రస్తుత సమాజంలో మరో ప్రధాన సమస్య రోడ్డు ప్రమాదాలు వీటివల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం అంతా సమస్యలు ఎదుర్కొంటుందని అన్నారు, విద్యార్థులు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని వాహనాలపై వేగంగా వెళ్ళవద్దు అని త్రిబుల్ రైడింగ్ లాంటివి నిర్వహించకూడదని బైక్ పై పందాలు పెట్టుకోకూడదని కోరారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు కలలు పిల్లలపై పెట్టుకుంటారని రోడ్డు ప్రమాదాలకు గురై తల్లిదండ్రుల కలలను ఆశలను అందాకారం చేయకూడదని అన్నారు. డ్రగ్స్ కు దూరంగా నిర్మూలనకు పాటుపడతాం డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దడానికి రహిత తెలంగాణ రాష్ట్రంగా ఏర్పాటు చేయడంలో ముందుంటామని ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పోలీసు కళాబృందం వారు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రా శ్రీనివాస్ రెడ్డి, మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణా రెడ్డి, మేళ్లచెరువు ఎస్ఐ నవీన్ కుమార్, షి టీమ్ ఎస్ఐ మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ డా.సురేష్ కుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఏం. ఈశ్వరయ్య, వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, ప్రసాద్, భూపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# సింగరేణిలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం






- ఆర్జీ-1 ఏరియాలో 20వ త్రైపాక్షిక భద్రతా సమీక్ష సమావేశం

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రామగుండం-1 ఏరియా ఆధ్వర్యంలో ఇల్లందు క్లబ్‌లో మంగళవారం 20వ ఏరియా స్థాయి త్రైపాక్షిక భద్రతా సమీక్ష సమావేశం ఘనంగా నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి గనుల భద్రతా విభాగం హైదరాబాద్ రీజియన్-2 ఉప గనుల భద్రతా సంచాలకుడు సగేష్ కుమార్, కార్పొరేట్ భద్రతా విభాగం జనరల్ మేనేజర్ కె. సాయిబాబు, ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మద్ది ఎల్లయ్య, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ పెరుమాళ్ల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

సమావేశ ప్రారంభంలో అతిథులకు స్వాగతం పలికి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గనుల్లో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల స్మారకార్థం మౌనం పాటించారు.

ఈ సందర్భంగా గత సమావేశపు నిర్ణయాల అమలు పురోగతిని సమీక్షించారు. గనుల్లో భద్రతా ప్రమాణాల అమలు, ప్రమాదాల నివారణ చర్యలు, కార్మికుల రక్షణ, యంత్ర పరికరాల నిర్వహణ, విద్యుత్ భద్రత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సున్నా ప్రమాదాల లక్ష్య సాధన కోసం ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అధికారులు, సూపర్వైజర్లు, కార్మిక సంఘాలు భద్రతా నాయకత్వాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా సగేష్ కుమార్ మాట్లాడుతూ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. ప్రమాద రహిత ఉత్పత్తి లక్ష్యంగా ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. గనుల్లో అమలవుతున్న భద్రతా చర్యలను అధికారులు సమీక్షించి పలు సూచనలు చేశారు.

సమావేశంలో దీపక్ కుమార్ ప్రభాకర్, అనిల్ టొప్పో, కోమల్ చౌదరి, డాక్టర్ కౌశిక్ సేన్‌గుప్తా, ఎం. మల్లయ్య, కె. చంద్రశేఖర్, జి.వి. రాజాజీ, చిల్క శ్రీనివాస్, లఖిడ రమేష్, డి. రమేష్, సాయి ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, ఏజెంట్లు, గని మేనేజర్లు, భద్రతా అధికారులు, ఇంజినీర్లు, కార్మిక తనిఖీదారులు, మహిళా ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మిక ప్రతినిధులు, కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# 800 మెగావాట్ల సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణంపై కీలక సమీక్ష





- **రామగుండం బీ-థర్మల్ కేంద్రాన్ని సందర్శించిన జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ హరీష్ -- ఎనర్జీ శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్**

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

తెలంగాణ విద్యుత్ రంగ అభివృద్ధిలో భాగంగా రామగుండంలోని పాత బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో ప్రతిపాదిత 800 మెగావాట్ల సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై రాష్ట్ర ఎనర్జీ శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, తెలంగాణ జెన్‌కో , ట్రాన్స్‌కో ఛైర్మన్ ఒ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ మంగళవారం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి సమగ్రంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా అధికారులు ప్రస్తుతం పనిచేయకుండా ఉన్న బీ-థర్మల్ విద్యుత్ కేంద్రంలోని వివిధ యూనిట్లు, యంత్ర సామగ్రి, భవనాలు, ఇతర మౌలిక వసతులను పరిశీలించి, కేంద్రాన్ని పూర్తిస్థాయిలో మూసివేయడానికి చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. పాత విద్యుత్ కేంద్రం స్థానంలో ఆధునిక సాంకేతికతతో కూడిన 800 మెగావాట్ల సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన భూవినియోగం, మౌలిక వసతులు, పర్యావరణ అనుమతులు, సాంకేతిక అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధిక సామర్థ్యం కలిగిన కొత్త విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు పేర్కొన్నారు. రామగుండం విద్యుత్ ఉత్పత్తి రంగంలో కీలక కేంద్రంగా కొనసాగేందుకు ఈ 800 మెగావాట్ల ప్రాజెక్టు దోహదపడుతుందని, ప్రాజెక్టు అమలుతో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరగడమే కాకుండా స్థానిక ప్రాంత అభివృద్ధికి, ఉపాధి అవకాశాల కల్పనకు కూడా తోడ్పాటునిస్తుందని అభిప్రాయపడ్డారు. పర్యటన సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక ఏర్పాట్లు, పాత కేంద్రం డీకమిషనింగ్ ప్రక్రియ, భద్రతా ప్రమాణాలు, ఆస్తుల నిర్వహణ తదితర అంశాలపై ఉన్నతాధికారులు సంబంధిత ఇంజనీర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి ప్రతిపాదిత సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జెన్‌కో ఉన్నతాధికారులు, బీ-థర్మల్ కేంద్రం అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బి.ఆర్.ఎస్ నాయకుడు కాంగ్రెస్‌లో చేరిక



రాజాపేట మండలం, లక్ష్మక్కపల్లి గ్రామంయాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 23 / :

మంగళవారం రోజు రాజాపేట మండలం లక్ష్మక్కపల్లి గ్రామ బి.ఆర్.ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గిరాజ్ మహేష్ తమ అనుచరగణంతో కలిసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమక్షంలో, ప్రభుత్వ డిసి అధ్యక్షుల ఆధ్వర్యంలో గిరాజ్ మహేష్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించబడ్డారు. ఈ సందర్భంగా గిరాజ్ మహేష్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, బీర్ల ఐలయ్య నాయకత్వాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలి: సీఐటీయూ



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీపీసీ ప్రధాన ద్వారం-2 వద్ద కాంట్రాక్టు కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎండి యాకూబ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాల ఉత్తర్వులను సవరించి నెలకు రూ.26 వేల వేతనాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే భవిష్యనిధి (పీఎఫ్), ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ), బోనస్‌లపై అమలులో ఉన్న పరిమితులను తొలగించి కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 25న సాయంత్రం 5 గంటలకు ఎన్టీపీసీలోని కేంద్ర కార్మిక కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న భారీ ధర్నాలో కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, దండ రాఘవరెడ్డి, కాదాసి మల్లేష్, అక్కపాక శంకర్, ఎం. శ్రీనివాస్, కనకయ్య, ధరణి రాజయ్య, దేవేందర్ రెడ్డి, జె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదిక లో విత్తన మేళా



ఓదెల /పెద్దపల్లి జూన్ 23(అక్షరం న్యూస్)

ఓదెల మండల కేంద్రం లో నీ రైతు వేదిక లో విత్తన మేళా" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వలన రైతు సోదరులు ఆరుతడి పంటలు, తక్కువ కాల పరిమితి ఉన్న వరి రకాలను సాగు చేయాలి అని రైతులకు. సూచించారు అదేవిధంగా మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 23 .6 .26 నుండి 30.6.26 వరకు ప్రత్యేక విత్తనమేల నిర్వహించడం జరుగుతుందని రైతు వేదికలో ప్రత్యేక కౌంటర్ ద్వారా 7 ఏడు రకాల సన్న వడ్లు అందించడం జరుగుతుందని. అదేవిధంగా బిపిటి 5204. కేఎన్ఎమ్. 1638. జైశ్రీరామ్ . ఆర్ ఎన్ ఆర్ 15048. కేఎన్ఎం 7715. హెచ్ఎంటి సోనా. డబ్ల్యూ జి ఎల్ 44 వంటి సన్న సన్న రకాలు వేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తుందని పేర్కొన్నారు ప్రతి రైతు ఈ విషయాన్ని గమనించి తగ్గట్టుగా వరి ధాన్యం సన్న రకాలు వేసుకోవాలని అదేవిధంగా సాంప్రదాయ ఎరువులు యూరియా తగ్గించి నానో యూరియా నానో డిఏపి వాడాలని రసాయనిక మందులు వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగు వేయాలని కోరారు కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఏఈఓ లు రైతులు పాల్గొన్నారు.

## ప్రీ.ప్రైమరీ బోధకులకు సన్మానం



ఓదెల/ పెద్దపల్లి జూన్ 23(అక్షరం న్యూస్)

పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్ది ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత మీపై ఉందని సర్పంచ్ కనకిరెడ్డి సతీష్ అన్నారు ఈ సందర్భంగా ఓదెల గ్రామంలో మల్లికార్జున్ నగర్ లో ప్రీ ప్రైమరీ పాఠశాల కు ఎన్నికైనటువంటి బోధకురాలు మద్ది స్రవంతి మరియు ఆయా బీరం సునీత ఇరువురు మంగళవారం విధుల్లో చేరిన సందర్భంగా ఇద్దరినీ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచి మరియు పాలకవర్గం ఎంఈఓ వై రమేష్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఈ సందర్భంగా సర్పంచ్ కనకిరెడ్డి సతీష్ మాట్లాడుతూ ముందుగా బోధకురాలు మరియు ఆయా కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ మీ సేవలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని ప్రైవేటు పాఠశాలలకు పోటీగా మన ప్రభుత్వం విద్యాసంస్థలు ఉండాలని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని అన్నారు అదేవిధంగా మొట్టమొదటిసారిగా ప్రీ ప్రైమరీ స్కూల్ మంజూరు చేసిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు ఈ సందర్భంగా ఎం ఈ ఓ రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో పంపితే వారు భవిష్యత్తుకు మేము భరోసా ఇస్తామని అన్నారుఈ కార్యక్రమంలో సర్పంచ్ కనికి రెడ్డి సతీష్ ఎంఈఓ రమేష్ క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు వి పద్మ ప్రిన్సిపల్ రమేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు

## నూతన నూతన అధికారులను సన్మానించిన సర్పంచ్



ఓదెల /పెద్దపల్లి జూన్ 23(అక్షరం న్యూస్)

ఓదెల మండల నూతన తహసిల్దారు వనజా నాయక్ మరియు, నూతన ఎంపీడీవో అనిల్ రెడ్డి లని హరిపురం గ్రామ సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పూల బొకే అందించారు ఈ సందర్భంగా నూతన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండల అభివృద్ధికి మీ సేవలు ఎంతో ఉపయోగపడాలని ఆకాంక్షించారు. అధికారులు కూడా ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో సమర్థవంతమైన పాలన అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసరి మహేందర్ యాదవ్, ముప్పు రాకేష్, అట్టేపల్లి రాజు, బేరం అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గంగాదేవి బోనాలు



ఓదెల /పెద్దపల్లి జూన్ 23 (అక్షరం న్యూస్)

ఓదెల మండలంలోని కనగర్తి గ్రామంలో మంగళవారం ఘనంగా గంగాదేవి బోనాల పండగ రంగ రంగ వైభవంగా నిర్వహించారు ప్రతి ఇంటికి ఒక బోనం బయలుదేరి శివసత్తుల పూనకాలతో డప్పు సప్పులతో అమ్మవారికి బోనాలు సమర్పించారు ప్రతి సంవత్సరం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ పండుగకు ఒక ప్రత్యేకత సంతరించుకుంది గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆ గంగాదేవి గుడికి వెళ్లి మోక్కితే తమ కోరికలు తీరుతాయని ఆపత తొలిగిపోతుందని నమ్మకం ఈ గ్రామంలో ప్రత్యేకంగా సంతరించుకుంది ప్రతి ఇంటికి ఒక బోనంతో అమ్మవారికి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమ్మవారి దయతో వర్షాలు పుష్కలంగా పడి రైతులంతా సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకోవడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొప్పరి సంధ్య కుమార్ తో పాటు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్ ఉపసర్పంచి మరియు నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## కనీస వేతనాల జీవోను సవరించి విడుదల చేయాలి సీఐటీయూ



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీవోను వెంటనే సవరించి విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్జీ-1 ప్రాంతంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సివిల్, సివిక్ కాంట్రాక్టు కార్మికుల అడ్డాల వద్ద మంగళవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న ఎన్టీపీసీలోని కేంద్ర కార్మిక కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీవోలను సవరించి విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల వేతనాలను కూడా పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వెంటనే కనీస వేతనాల జీవోలను సవరించి నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే భవిష్యనిధి, బోనస్‌లపై ఉన్న పరిమితులను తొలగించి అందరికీ ఉద్యోగుల రాష్ట్ర బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గోదావరిఖని పట్టణ కార్యదర్శి మేదరి సారయ్య, నాయకులు ఉపేందర్, రాజు, రామానుజం, రాజేందర్, కేతమ్మ, కనకలక్ష్మి, స్వప్న, సునీత, కృష్ణవేణి, జ్యోతి, స్వరూప, శాంతి, వినోద, నాగమణి, వసంత, ప్రసాద్, శ్రీనివాసాచారి, చందు, రాజేశ్వరి, దీక్షకుమారి, మమత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం పనులు వేగవంతం చేయాలి

- ఇందన శాఖ కార్యదర్శి, జెన్కో సీఎం.డీకి కాంగ్రెస్ నాయకుల వినతి



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 23: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పట్టణంలో గతంలో మూసివేయబడిన 62.5 మెగావాట్ల విద్యుత్ కేంద్రం స్థానంలో ప్రతిపాదిత 800 మెగావాట్ల నూతన విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఇందన శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్, జెన్కో సీడఎం.డీ హరీష్ రావు రామగుండం జెన్కోను సందర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచనల మేరకు కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో ఆర్ఎంసీ డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య యాదవ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దీటి బాలరాజు, కార్పొరేటర్లు ఎండీ ముస్తఫా, ఈసంపెల్లి అంజయ్య, మాజీ కార్పొరేటర్ సలీం, మహమ్మద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరి ప్రసాద్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు అధికారులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అనంతరం రామగుండం ప్రాంత అభివృద్ధికి కీలకంగా మారనున్న 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్లాంట్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించాలని వారు కోరారు. ఈ ప్రాజెక్టు అమలుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రామగుండం ప్రాంతం పారిశ్రామికంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతుందని నాయకులు పేర్కొన్నారు.

## రామగుండంలో బయోమైనింగ్ వ్యవస్థ ఏర్పాటుకు సహకరించండి



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం నగరాభివృద్ధికి సహకరించాలని పురపాలక పరిపాలనా శాఖా సెక్రెటరీ టి . కె . శ్రీదేవి ని మేయర్ మహంకాళి స్వామి కోరారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ ఆద్వర్యంలో హైదరాబాద్ లోని ఒక హోటల్ లో మునిసిపల్ ఛైర్మన్ , మేయర్ లకు మంగళ వారం నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెను మేయర్ కలిశారు. ఈ సందర్భంగా రామగుండం నగరంలో జరుగుతున్న అభివృద్దిని ఆమెకు వివరించినట్లు తెలిపారు . ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో బయో మైనింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి సహకరించాలని అలాగే పనికి రావనుకున్న వాటి నుంచి కూడా అద్భుతాలు సృష్టించే వస్తువుల తయారీ వేస్ట్ టు వండర్ యూనిట్లు స్వశక్తి మహిళల ద్వారా స్థాపించడానికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించాలని కోరినట్లు తెలిపారు . మెరుగైన సేవలు అందించడానికి జనాభా కు తగినట్లుగా పారిశుధ్య సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని మేయర్ తెలిపారు.

## అభివృద్ధి పనులన్నీ నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

అభివృద్ధి పనులు నాణ్యత తో సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె, అరుణ శ్రీ కోరారు. నగరంలో వివిధ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం అధికారులు , సంబందిత కాంట్రాక్టర్ లతో మంగళ వారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని అన్నారు. క్షేత్ర స్థాయిలో పని పూర్తయిన తరువాత సైట్ క్లియర్ చేసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చే అవకాశం లేకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అన్నారు. తగిన కారణం లేకుండా పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్ లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఎ ఇ తేజస్విని , మనోజ్ , అన్వేష్ , టెక్నికల్ ఆఫీసర్ సౌమ్య , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ , పలువురు కాంట్రాక్టర్ లు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ





జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 23 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

నిరుపేద విద్యార్థులకు విద్యా సహాయం అందించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని లయన్స్ జిల్లా 320జీ గవర్నర్ సింహరాజు కోదండరామ్ అన్నారు. ఎన్టీపీసీ సాయి సేవా సమితిలో మంగళవారం నిర్వహించిన పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని వాసవి అధ్యక్షుడు కొమురవెల్లి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాయి సేవా సమితిలో యూకేజీ నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న నిరుపేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తూ విద్యాభివృద్ధికి తోడ్పడుతున్న కొమురవెల్లి అరుణ--సుధాకర్ దంపతులను జిల్లా గవర్నర్ అభినందించారు. వారి సేవలు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వాభివృద్ధి సమన్వయకర్త బంక రామస్వామి, ప్రాంతీయ అధ్యక్షుడు కజంపురం రాజేందర్, మండల అధ్యక్షుడు నార్ల ప్రసాద్, కోదాటి ప్రవీణ్, దొండపాటి మహేందర్ రెడ్డి, కొమురవెల్లి రాహుల్, కొమురవెల్లి రోహిత్, ధరణి పోచం, మెట్పల్లి అనిల్ రావు, ఇల్లెందుల శ్రీనివాస్, దొంతుల గంగాధర్, ఆముల శ్రీనివాస్, కొమురవెల్లి కుటుంబ సభ్యులు, సాయి సేవా సమితి అధ్యక్షుడు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన పౌరుడుగా ఎదగాలి

- పన్నూరు కస్తూరిబా లో డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన
- ఎస్సై తాడవేని శ్రీనివాస్



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జూన్ 23 అక్షరం న్యూస్:

ప్రతి విద్యార్థి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరుడుగా ఎదగాలని రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ అన్నారు. డ్రగ్స్ వినియోగంపై మండలంలోని పన్నూరు కస్తూరిబా పాఠశాల లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు యాంటీ డ్రగ్ సోల్జర్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో పాలుపంచుకోవాలని కోరారు.మత్తు పదార్థాల భారిన పడడం వల్ల బంగారు భవిష్యత్ నాశనం అవుతోందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్య విచ్ఛిన్నం కావడంతో పాటు, ఆర్థిక సమస్యలు, సమాజంలో గౌరవం లేకుండా పోతుందన్నారు. ఒక్కసారి డ్రగ్స్ సేవించి పట్టుబడి కేసు నమోదైతే భవిష్యత్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలకు, ఏ ఇతర దేశాలకు కూడా వెళ్లే అవకాశం దొరకక జీవితం అంధకారంలోకి వెళ్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే సమాచారం తెలుపాలన్నారు. అనంతరం నేను మాదక ద్రవ్యాల నిరోధకతపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మంజుల,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు కృషి చేయాలి

- గ్రంథాలయ చైర్మన్ రాంబాబు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరంన్యూస్ ) జూన్ 23 :

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు అన్నారు మంగళవారంమండల కేంద్రంలో జరిగిన గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశానికి గ్రామ పార్టీ అధ్యక్షుడు కడారి రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తరువాత జరిగిన గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన వివరించారు, కాంగ్రెస్ పార్టీ బలోపేతం గురించి , ఎమ్మెల్యే కడియం శ్రీహరి నుండి అధిక నిధులు తేవడం కోసం , మండల కేంద్రంలో పలు సమస్యల ఉన్నాయా అని చర్చించారు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం కోసం , సిసి రోడ్లు సైడ్ డ్రైనేజ్ , కమ్యూనిటీ భవనాల తోపాటు వివిధ అంశాలపై కాంగ్రెస్ కార్యకర్తల సమీక్షించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గాదె మహేందర్ రెడ్డి , మాజీ సర్పంచ్ పోకల శివకుమార్ , పెర్ని రవి కురుమ , కడారి చిన్న నాగేష్ , నీలం వాసు , కాదునూరి యాదగిరి , వార్డ్ మెంబర్లు స్పందన రెడ్డి , గంద్ర కృష్ణ , బొట్ల రాజు , కడారి కుమార్ , కడారి మహేందర్ , కడారి ఐలు మల్లు , బైరపాక ఎల్లయ్య , సింగపురం ప్రవీణ్ , పల్లపు మురళి , అన్నపురెడ్డి రంజిత్ , కర్రె ఐలయ్య , కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముస్తాబాద్ రైతు వేదికలో విత్తన మేళా -- 100శాతం సబ్సిడీపై కందుల మినీకిట్ల పంపిణీ



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -23(అక్షరం న్యూస్ )
ముస్తాబాద్ మండల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా (సీడ్ మేళా) కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు నాణ్యమైన విత్తనాల వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో భాగంగా 30 మంది రైతులకు 100 శాతం సబ్సిడీపై కందులు (రెడ్‌గ్రామ్) మినీకిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె. అనూష మాట్లాడుతూ, రైతులు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అలాగే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ ప్రాంతానికి అనుకూలమైన సన్న రకాల వరి సాగు చేపట్టడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు.అనంతరం జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రాజిరెడ్డి రైతులకు ఆయిల్ పామ్ సాగు ప్రాధాన్యత, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, దీర్ఘకాలిక ఆదాయ అవకాశాల గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం. నరేష్,ఎం. రేవతి, బి. అఖిల రైతులకు విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, పంటల నిర్వహణ, ఎరువుల సమతుల్య వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.రైతులు ప్రభుత్వ వ్యవసాయ పథకాల ను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలతో సాగు చేపట్టి అధిక దిగుబడులు అధిక ఆదాయం సాధించాలని అధికారులు కోరారు ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్లు కొండల్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -23(అక్షరం న్యూస్ )
ముస్తాబాద్ మండల కేంద్రం లో జనసంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలి దాన్ దివస్)సందర్భంగా ఘ నంగా నిర్వహించారు . ఈ సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక వివేకానంద విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సౌళ్ళ క్రాంతికుమార్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు డా. శ్యాం ప్రసాద్ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.అనంతరం మాట్లాడుతు ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని అంటూ ఏక్ భారత్ అనే నినాదంతో అందరిని ఏకతాటిపై తీసుకురావడానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అన్నారు .
ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపి,జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజగౌడ్,ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి , చిట్నేని శ్రీనివాస్ రావు, కరెడ్ల రమేష్ రెడ్డి, మెంగని మహేందర్, బాధ నరేష్, తాండ్ర రామ్ గోపాల్, కామెటికారీ పద్మ, పప్పుల శ్రీకాంత్, దీటి సత్తయ్య,వేణుగోపాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపల్లి రైతు వేదికలో ప్రారంభమైన విత్తనమేళా



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)జూన్ 23:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విత్తనమేళా కార్యక్రమం మండల కేంద్రం లోని రైతు వేదిక భవనంలో మంగళవారం ప్రారంభించారు. విత్తనమేళాలో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న రకం వడ్ల విత్తనాలను రైతులు కొనుగోలు చేసేందుకు అందుబాటులో ఉంచారు. అధిక దిగుబడులు పొందడానికి రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అక్కిరెడ్డి కరుణాకర్, ఎఇవోలు కరుణాకర్, కల్పన రైతులు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ సూపర్వైజర్ కి సన్మానం



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) జూన్ 23 అక్షరం న్యూస్:
రామగిరి ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎర్రవెల్లి శృతిజ మంగళవారం రత్నాపూర్ గ్రామంలో అంగన్ వాడి కేంద్రంను తనిఖీ చేశారు. ఇటీవల ఆమె విధుల్లో చేరారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ లో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ను ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎర్రవెల్లి శృతిజ మర్యాదపూర్వకంగా కలువగా ఆమె శాలువాతో సన్మానించారు. నూతన అంగన్వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ ను సర్పంచ్ కి ఆమె అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గంగుల సంతోష్ పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాల ప్రదర్శన, అమ్మకాలు

- రత్నాపూర్‌లో విత్తన మేళా..



రామగిరి, పెద్దపల్లి జిల్లా, జూన్ 23 (అక్షరం న్యూస్): రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా రత్నాపూర్ రైతు వేదికలో సోమవారం “విత్తన మేళా -- రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు” కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు.ఈ సందర్భంగా వరి పంటకు సంబంధించిన ప్రాధాన్యత గల బిపిటి-5204, ఆర్ఎన్ఆర్-15048, కేఎన్ఎం-7715, కేఎన్ఎం-1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ సోనా వంటి వరి వంగడాలను ప్రదర్శించారు. అలాగే పప్పు దినుసుల పంటలైన పెసర, కంది, నూనె పంటలైన నువ్వుల వంగడాలను కూడా స్టాల్స్‌లో ప్రదర్శించి రైతుల కొనుగోలుకు అందుబాటులో ఉంచారు.విత్తన మేళాకు హాజరైన రైతులు వివిధ వరి వంగడాల లక్షణాలు, దిగుబడులు, సాగు విధానాలపై తమ సందేహాలను వ్యవసాయ అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. అదేవిధంగా నానో యూరియా, నానో డీఏపీ, ట్రైకోడెర్మా, పీఎస్‌బీ వంటి నానో ఎరువులు, జీవ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించి అమ్మకాలు నిర్వహించారు.కార్యక్రమానికి ఉద్యానవన పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ప్రణీత్ కుమార్ హాజరై పాలిటెక్నిక్‌లో అందిస్తున్న కోర్సులు, ప్రవేశాల వివరాలతో పాటు బొకేలు, కీచైన్ల తయారీ వంటి నైపుణ్యాల గురించి వివరించారు.ఈ విత్తన మేళాలో రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ, పన్నూరు సర్పంచ్ చిందం మహేష్, సుందిళ్ల సర్పంచ్ ముసుకుల నరేందర్ రెడ్డి, లొంక కేసారం సర్పంచ్ వీరగోని రమాదేవి, ఏఈవోలు అరవింద్, మౌనిక, రమేష్, మండలంలోని విత్తనాల డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట పశువైద్య కేంద్రంలో వెటర్నరీ అధికారికి ఘన వీడ్కోలు



రామగిరి, పెద్దపల్లి జిల్లా, జూన్ 23 (అక్షరం న్యూస్): రామగిరి మండలంలోని బేగంపేట ప్రాథమిక పశువైద్య కేంద్రంలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన సత్యపు నారాయణ తుఫ్రాన్‌కు బదిలీ కావడంతో సోమవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమం అడిషనల్ ఛార్జ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డా. మరళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యపు నారాయణ తన సేవా కాలంలో పశు పోషకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నాణ్యమైన పశువైద్య సేవలు అందించారని, శాఖ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు.అనంతరం ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. సత్యపు నారాయణ మాట్లాడుతూ తనకు సహకరించిన అధికారులు, సిబ్బంది, పశుపోషకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సందేల రేణుక కుమారస్వామి, వార్డు సభ్యులు, పశువైద్య శాఖ సిబ్బంది, పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు ఊపిరి

- కొత్త స్థలంపై కేంద్రానికి ప్రతిపాదనలు.
- 10 రోజుల్లో ఫీజిబిలిటీ నివేదిక ఇవ్వాలని అధికారులకు కేంద్ర మంత్రి ఆదేశం.
- రాంమోహన్ నాయుడిని కలిసిన మంత్రులు తుమ్మల, ఉత్తమ్.
- జులైలో మామునూరు ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన.

న్యూఢిల్లీ / జూన్ 23 / అక్షరం న్యూస్ -:
దశాబ్దాలుగా భద్రాద్రి జిల్లావాసులు ఎదురుచూస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇప్పటికే ప్రతిపాదించిన స్థలాలు సాంకేతిక కారణాలతో అనుకూలం కాదని తేలడంతో ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించిన ప్రభుత్వం, అక్కడ సాధ్యాసాధ్యాల పరిశీలనను వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడిని కలిసి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై విస్తృతంగా చర్చించారు.

### గత రెండు ప్రతిపాదనలకు సాంకేతిక అడ్డంకులుః.

కొత్తగూడెం సమీపంలో గతంలో ప్రతిపాదించిన రెండు స్థలాల్లో విద్యుదీకృత రైల్వే మార్గం, కొండలు అత్యంత సమీపంలో ఉండటం వల్ల విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భద్రతా ప్రమాణాలు నెరవేరడం లేదని ఫీజిబిలిటీ అధ్యయనాల్లో తేలిందని మంత్రి తుమ్మల వివరించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మరో అనుకూలమైన స్థలాన్ని గుర్తించి, దానిపై సమగ్ర నివేదిక రూపొందించేందుకు ఏవియేషన్ సంస్థను నియమించినట్లు తెలిపారు.

### కొత్త స్థల ప్రతిపాదనపై 10 రోజుల్లో నివేదికః.

కొత్తగా ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించి ఫీజిబిలిటీ నివేదికను పది రోజుల్లో అందజేయాలని కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రక్రియలను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు.

### మామునూరు ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపనః.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే వరంగల్ జిల్లా మామునూరు మరియు ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణాలపై చర్చలు జరిపినట్లు కేంద్రమంత్రి తెలిపారు. వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయానికి జులైలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు ఈ సందర్భంగా వెల్లడించారు. అదేవిధంగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టును త్వరలోనే రక్షణశాఖ ద్వారా అనుమతులు పొంది, వారి ద్వారానే నిర్మాణం చేపట్టడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### భద్రాచలం భక్తులకు వరంః.

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఏటా లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని చెప్పారు.

### పారిశ్రామిక, విద్యా రంగాలకు కొత్త ఊపుః.

సింగరేణి బొగ్గుగనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, బీపీఎల్ వంటి ప్రముఖ పరిశ్రమలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇప్పటికే ప్రత్యేక పారిశ్రామిక గుర్తింపు పొందిందని తుమ్మల తెలిపారు. జిల్లాలో ఉన్న అటవీ సంపద, ఖనిజ వనరులు, ఎకో టూరిజం అవకాశాలు, ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు విమానాశ్రయం మరింత బలం చేకూరుస్తుందని పేర్కొన్నారు. దీనివల్ల పెట్టుబడులు పెరగడంతో పాటు విద్యా, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారంః.

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, అనుమతుల ప్రక్రియలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు త్వరలోనే వాస్తవరూపం దాల్చుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## అరటి ఆకులపై భోజనం చేయడం రుచికరం, ఆరోగ్యకరం..



అరటి ఆకుపై భోజనం చేయడం భారతీయ సంప్రదాయంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో పండుగలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకల సమయంలో అరటి ఆకులపై ఆహారం వడ్డించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇది కేవలం సంప్రదాయం మాత్రమే కాకుండా ఆరోగ్యపరంగా కూడా అనేక ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఇప్పటికీ ఓనమ్ సద్య వంటి ప్రత్యేక విందులను అరటి ఆకులపై వడ్డించే పద్ధతి కొనసాగుతోంది. అరటి ఆకుల్లో సహజంగా పాలీఫినాల్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి గ్రీన్ టీతోపాటు అనేక మొక్కల ఆధారిత ఆహారాల్లో కనిపించే పోషక పదార్థాలు. వేడి ఆహారాన్ని అరటి ఆకుపై వడ్డించినప్పుడు ఈ పాలీఫినాల్స్ కొంతమేర ఆహారంలోకి చేరే అవకాశం ఉందని భావిస్తారు. ఇవి శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించడంలో సహాయపడటంతోపాటు జీవనశైలి సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఉపయోగపడతాయి.

## ప్రోటీన్లు ఉండే ఆహారాలను రోజూ తింటే ఎన్నో లాభాలు.. ఏయే ఆహారాలు మేలు చేస్తాయంటే..



బరువు తగ్గాలనుకునే వారికి అధిక ప్రోటీన్ ఆహారం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం ఆకలిని తగ్గించడమే కాకుండా ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. అంతేకాకుండా శరీరం రోజులో ఖర్చు చేసే కేలరీల సంఖ్యను పెంచడంలోనూ సహాయపడుతుంది. దీని వల్ల శరీరంలోని కొవ్వు తగ్గి కండరాల దృఢత్వం పెరుగుతుంది. ముఖ్యంగా దీర్ఘకాలం పాటు అధిక ప్రోటీన్ ఆహారాన్ని కొనసాగించే వారిలో తిరిగి బరువు పెరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. వే ప్రోటీన్ బరువు తగ్గడంలో ప్రముఖ పాత్ర పోషించే ప్రోటీన్లలో ఒకటి. పాల నుంచి లభించే ఈ ప్రోటీన్ త్వరగా కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. ఇతర ప్రోటీన్ మూలాలతో పోలిస్తే ఆకలిని సమర్థంగా నియంత్రిస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అలాగే శరీర నిర్మాణాన్ని మెరుగుపరచడంలోనూ ఇది సహాయపడుతుంది.

### బరువు తగ్గడంలో..

ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలు కూడా బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుడ్లు, చికెన్, చేపలు, పాలు, పనీర్, చీజ్, పప్పుధాన్యాలు, క్వినోవా, నట్స్ వంటి ఆహారాలు ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేసి రోజంతా అనవసరంగా తినాలనే కోరికను తగ్గిస్తాయి. సోయా ప్రోటీన్ కూడా బరువు నియంత్రణలో సహాయపడే మొక్కల ఆధారిత ప్రోటీన్‌గా గుర్తింపు పొందింది. సోయాబీన్స్ నుంచి తయారయ్యే ఈ ప్రోటీన్‌లో శరీరానికి అవసరమైన ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. అయితే బరువు తగ్గడంలో దీని ప్రభావాన్ని పూర్తిగా నిర్ధారించే బలమైన శాస్త్రీయ ఆధారాలు ఇంకా పరిమితంగానే ఉన్నాయి. కేసిన్ ప్రోటీన్ కూడా పాల నుంచే లభించే మరో ముఖ్యమైన ప్రోటీన్. ఇది నెమ్మదిగా జీర్ణమవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల తరచూ ఆకలి వేయకుండా ఉండటంతో బరువు తగ్గడంలో సహాయపడుతుంది.


### ఆకలి నియంత్రణకు..

బఠానీ ప్రోటీన్ లేదా పీ ప్రోటీన్‌లో కూడా శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇవి తృప్తి భావనను పెంచి ఎక్కువసేపు ఆకలిని నియంత్రిస్తాయి. అలాగే శరీర నిర్మాణాన్ని మెరుగుపరచడంలోనూ కొంత మేర ప్రయోజనం కలిగిస్తాయి. రైస్ ప్రోటీన్ మరో మొక్కల ఆధారిత ప్రోటీన్. ఇందులో అన్ని అవసరమైన అమైనో ఆమ్లాలు లేకపోయినా, సాధారణంగా పీ ప్రోటీన్‌తో కలిపి ఉపయోగిస్తారు. ఇది శరీరంలోని కొవ్వును తగ్గించి కండరాల పరిమాణాన్ని పెంచడంలో తోడ్పడుతుంది. హెంప్ ప్రోటీన్‌లో ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. అయితే ఇందులో అన్ని అవసరమైన అమైనో ఆమ్లాలు లేకపోవడం వల్ల దీనిని పూర్తి ప్రోటీన్‌గా పరిగణించరు. అయినప్పటికీ సమతుల ఆహారంలో భాగంగా తీసుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

### ప్రోటీన్ మాత్రమే కాదు..

బోన్ బ్రోత్ ప్రోటీన్ జంతువుల ఎముకలను నీటిలో మరిగించడం ద్వారా తయారవుతుంది. ఈ ప్రక్రియలో ఎముకలలోని కొన్ని పోషకాలు ద్రవంలోకి వస్తాయి. అయితే ఇది కూడా పూర్తి ప్రోటీన్ కాదు. అయినప్పటికీ కొందరు దీనిని ప్రోటీన్ సప్లిమెంట్‌గా వినియోగిస్తారు. అయితే బరువు తగ్గడానికి కేవలం ప్రోటీన్ మాత్రమే సరిపోదు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, తగినంత నిద్ర, ఆరోగ్యకర జీవనశైలి కూడా సమానంగా అవసరం. అధిక ప్రోటీన్ ఆహారం తీసుకునే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

## టూత్ సెన్సిటివిటీ అధికంగా ఉందా.. అయితే ఈ ఇంటి చిట్కాలను పాటించండి..



దంతాల సున్నితత్వం (టూత్ సెన్సిటివిటీ) చాలా మందిని ఇబ్బంది పెట్టే సాధారణ సమస్య. వేడి టీ, చల్లని ఐస్‌క్రీమ్ లేదా పుల్లని ఆహారం తీసుకున్నప్పుడు దంతాలలో ఒక్కసారిగా గుచ్చినట్టు నొప్పి అనిపించడం దీని ప్రధాన లక్షణం. దంతాలపై ఉండే ఎనామెల్ పొర దెబ్బతినడం వల్ల లోపలి డెంటిన్ బయటపడితే ఈ సమస్య ఏర్పడుతుంది. అమెరికన్ డెంటల్ అసోసియేషన్ జర్నల్ ప్రకారం ప్రతి ఎనిమిది మంది పెద్దల్లో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. దంతాలను గట్టిగా లేదా ఎక్కువ ఒత్తిడితో బ్రష్ చేయడం, అధికంగా ఆమ్ల గుణాలు ఉన్న ఆహారాలు, పానీయాలను తీసుకోవడం, దంతాలను రాత్రిపూట రుద్దకపోవడం, పాత ఫిల్లింగ్స్ దెబ్బతినడం, దంత క్షయం లేదా కొన్ని దంత చికిత్సల తర్వాత కూడా టూత్ సెన్సిటివిటీ కనిపిస్తుంది. టూత్ సెన్సిటివిటీ నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పునీరు ఉపయోగకరంగా ఉంటుంది. ఇది నోటిలో పీహెచ్ సమతుల్యతను కాపాడి హానికర బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకుంటుంది. అంతేకాకుండా సహజ యాంటీ సెప్టిక్‌గా పనిచేసి నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. గోరువెచ్చని నీటిలో రెండు టీ స్పూన్ల ఉప్పు కలిపి రోజుకు రెండు సార్లు పుక్కిలించడం వల్ల సున్నితత్వం, నొప్పి తగ్గే అవకాశం ఉంటుంది.

# రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి





- **జగన్నాధపురం రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్.**

భద్రాద్రి కొత్తగూడెం ,/ పాల్వంచ /జూన్ 23/ అక్షరం న్యూస్ -:

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మంగళవారం పాల్వంచ మండలం జగన్నాధపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి, విత్తనాల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి వాటి ప్రామాణికతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న రకాల వరి విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలోని 43 రైతు వేదికల ద్వారా విత్తన మేళాలు నిర్వహిస్తున్నామని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. యూరియా బుకింగ్‌ను కూడా యాప్ ద్వారా నిర్వహిస్తున్నామని, రైతులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూరియా బుకింగ్ యాప్, విత్తనమేలపై రైతులలో అవగాహన కలిగించాలని వ్యవసాయ శాఖ అధికారులని ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయం, విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, వ్యవసాయ అవసరాలన్నీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విత్తన మేళా ద్వారా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు, యూరియా బుకింగ్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు కలెక్టర్ చేతులమీదుగా విత్తనాలు, యూరియా అందించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సోసిటీ ఛైర్మెన్ కొత్వాల శ్రీనివాస్, తాసిల్దార్ ధారా ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి





- **ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్.**
- **పాల్వంచ గురుకుల పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు.**

భద్రాద్రి కొత్తగూడెం / పాల్వంచ / జూన్ 23 / అక్షరం న్యూస్ -:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గల బాలుర గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పి రోహిత్ రాజు పాఠశాల విద్యార్థుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించి,అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల పరిధిలో మొక్కలు నాటారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముక లాంటివారు, క్షణకాలపు ఆనందం కోసం మత్తు పదార్థాల వైపు ఆకర్షితులై, తమ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను చేతులారా నాశనం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాల వల్ల శారీరకంగా మానసికంగా ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేశారు. విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, వైజ్ఞానిక పరిజ్ఞానం పిల్లలకు అవసరమని, సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలని, చదువుల్లో లేదా వ్యక్తిగత జీవితంలో ఒత్తిడి నుండి ఉపశమనానికై క్రీడలపై ఆసక్తి చూపాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు. అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే




ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని, చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు. ఓటీపి ట్రాప్,ఆన్లైన్ ట్రేడింగ్,సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణగా జిల్లాలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, అత్యవసర సమయాల్లో 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని సూచనలు చేశారు. అనంతర రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. సుమారు 300మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్. సతీష్ కుమార్, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, ఎక్సైజ్ సీఐ ప్రసాద్, పోలీసు అధికారులు, పాఠశాల మరియు కళాశాల, అధ్యాపకులు,ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# దేశంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రం !

హైదరాబాద్, జూన్23 దేశంలో రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయి. బెంగాల్ ఫలితాల తరవాత మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతు న్నాయి. తాజాగా ఆమెను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ మెజార్టీ ఎమ్మెల్యేలు తీర్మానం చేశారు. ఇక మహారాష్ట్రలో బాలథాక్రే స్థాపించిన శివసేన దాదాపు అంతర్థానం అయ్యే దుస్థితిలో ఉంది. యూపిలో అఖిలేశ్ పార్టీలో సైతం ముసలం పుట్టింది. ఇదంతా యాదృచ్ఛికంగా జరుగుతన్న దని భావించడానికి లేదు. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు వీగిపోయిన తరవాత అధికార బిజెపి వేస్తున్న ఎత్తుల కు ప్రాంతీయ పార్టీలు చిత్తవుతున్నాయి. ఇదే ఆయా పార్టీల పునాదులను పెకిలిస్తోందని భావించాలి. ఇదంతా కూడా మళ్లీ డీ లిమిటేషన్, మహిళా బిల్లును గట్టెక్కించే పనిలో అధికార పార్టీ చేస్తున్న కసరత్తుగానే గుర్తించాలి. ఈసారి ఈ రెండు బిల్లును ఎలాగైనా గట్టెక్కించే పనిలో మోడీ ద్వయంయ ఉన్నట్లుగా అర్థం అవుతోంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో ముసాయిదాను సిద్ధం చేసినా పార్లమెంట్‌లో తగిన మద్దతు దక్కుతుందన్న నమ్మకం కలిగితేనే ఈ





బిల్లును సభ ముందుకు తీసుకురావాలని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ చట్టం ఆమోదం పొందాలంటే లోక్‌సభ.. రాజ్యసభల్లో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతటితో ఈ పక్రియ పూర్తి కాదు. దేశంలోని కనీసం సగంరాష్ట్రాల శాసనసభలు ఈ బిల్లును ఆమోదించి తీరాల్సి ఉంటుంది. సంఖ్యాబలంపై పూర్తి ధీమా వచ్చాకే ఎన్డీయే సర్కార్ ఈ మహిళా బిల్లును అధికారికంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. గతంలో జరిగిన అవమానానికి బద్లా తీసుకునే పనిగా కూడా భావిస్తున్నారు. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ల అమలుపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఈ బిల్లును అమలులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తెరవెనుక పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. డీలిమిటేషన్.. సీట్ల పెంపు లాంటి కీలక అంశాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ ఓ సరికొత్త ముసాయిదాను ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే దీనిని గట్టెక్కించే పనిలో భాగగంఆ బలాన్ని పెంచుకునే ఎత్తులో బిజెపి ఉన్‌ట్లు స్పష్టం అవుతోంది. గతంలో ప్రతగిపాదించినట్లుగానే లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను ఏకంగా 50 శాతం పెంచే ఆలోచనలో మోడీ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ఇటీవల ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు వ్యతిరేకించడంతో అది వీగిపోయింది. బెంగాల్, తమిళనాడు ఎన్నికల తర్వాత విపక్షాల బలం తగ్గడంతో మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. మరింత పకడ్బందీగా 133వ రాజ్యాంగ సవరణను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ముఖ్యంగా సీట్ల పునర్విభజన సమయంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న అభ్యంతరాలకు చెక్ పెట్టేలా ఈ కొత్త ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పెంపు వల్ల జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే.. రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తిని 1971 జనాభా లెక్కల ఆధారంగానే కొనసాగించాలని కేంద్రం గట్టిగా భావిస్తోంది. అదే సమయంలో ఒక రాష్ట్రం పరిధిలో నియోజకవర్గాల సరిహద్దుల మార్పునకు మాత్రం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రభుత్వం సిద్ధం చేసిన ఈ కొత్త ముసాయిదా లో అత్యంత కీలకమైన అంశం చట్టసభల స్థానాల పెంపు. లోక్‌సభతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను భారీగా పెంచబోతున్నారు. వీలైనంత వరకు అన్ని చోట్లా ఏకంగా 50 శాతం మేర సీట్లను పెంచాలని కేంద్రం భావిస్తోంది.. సాధ్యమైనంత వరకు 50 శాతం పెంపు విధానాన్ని అమలు చేసి.. మహిళలకు తగినన్ని సీట్లు కేటాయించాలని చూస్తున్నారు. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 55, 81, 82తో పాటు 170, 330లకు మార్పులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న డీలిమిటేషన్ బిల్లులో కూడా తగిన సవరణలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ ఈ కొత్త సూత్రాల ఆధారంగానే తన పనిని కొనసాగించాల్సి ఉంటుంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే ముందుగా సభలో మొత్తం సభ్యుల సంఖ్య పెరగాలి. అప్పుడే సిట్టింగ్ ఎంపీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సీట్ల పెంపు ప్రక్రియతో కేవలం మహిళలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా భారీగా రాజకీయ లబ్ది చేకూరనుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం చూస్తే.. లోక్‌సభలో ఎస్సీ స్థానాలు ప్రస్తుతమున్న 84 నుంచి ఒకేసారి 136కు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఎస్టీల స్థానాలు కూడా 47 నుంచి 70కి పెరగనున్నాయి. ఈ మార్పు చేయడం ద్వారా లోక్‌సభలో షెడ్యూల్డ్ కులాలకు దక్కాల్సిన పూర్తి 16 శాతం కోటా వారికి అందుతుంది. పెరిగిన ఈ కొత్త స్థానాల్లో మహిళా రిజర్వేషన్లను వర్టికల్ విధానంలో పక్కాగా అమలు చేస్తారని ప్రచారం. అంటే పెరిగిన ఎస్సీ.. ఎస్టీ స్థానాల్లో కూడా మూడో వంతు సీట్లను ఆయా వర్గాలకు చెందిన మహిళలకే కేటాయిస్తారు. ఈ మొత్తం రాజకీయ పక్రియను 2029 సాధారణ ఎన్నికల నాటికి పూర్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. డీలిమిటేషన్ విషయంలో పలు రాష్ట్రాల నుంచి వ్యక్తమవుతున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపేలా ప్రధానమంత్రి కార్యాలయం ఇప్పటికే ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే భారత రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే ఈ భారీ నిర్ణయం అమలు చేయడం ప్రభుత్వానికి అంత సులభం కాదు. దీనికోసం చట్టసభల్లో స్పష్టమైన సంఖ్యాబలం అత్యవసరం. అందుకే ఇప్పుడు ఆయా పార్టీల్లో పగుళ్లు పడుతు న్నాయి. బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో దాదాపు ఆయా ప ఆర్టీలకు వణుకు పుట్టించేలా చీలికలు మొదలయ్యాయి. దీంతో లోక్‌సభలో, రాజ్యసభలో సంపూర్ణ మెజార్టీ కోసం యత్నాలు మొదలయ్యాయని భావించాలి. తమిళనాడులో కూడా డిఎంకె పరోక్షంగా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్‌పై గుర్రుగా ఉన్న ఆ పార్టీ,ఇండి కూటమితో కలసి వెళ్లకపోవచ్చు. మొత్తంగా రానున్న రోజుల్లో ఈ ముఖచిత్రం మరింత స్పష్టంగా ఆవిష్కృతం కానుంది.

# 60 ఏళ్ల ప్రయాణంలో శివసేన అంతర్ధాన దశ

- ఉద్ధవ్ స్వయంకృతంతో పార్టీకి ముప్పు
- తండ్రి ఆశయాలు కాపాడడంలో పూర్తిగా విఫలం



ముంబై,జూన్23 : మహారాష్ట్రలో బలంగా నిలిచిన శివసేన కథ ఇంక కంచికేనా అన్న చర్చ సాగుతోంది. బాణంలా దూసుకుని వచ్చిన బాల్ థాక్రే స్థాపించిన 'శివసేన' సరిగ్గా 60 వసంతాలు పూర్తి చేసుకుని వజ్రోత్సవ వేడుకలకు సిద్ధం అవుతున్న వేళ..అంతర్థానానికి దగ్గరవుతోంది. యాదృచ్ఛికమే అయినా 60 వసంతాల పార్టీ ఇలా కావడం స్వయంకృతమే. 1966 జూన్ 19న ముంబైలోని చారిత్రాత్మక శివాజీ పార్క్‌లో బాల్ థాక్రే కొబ్బరికాయ కొట్టి ఈ పార్టీని ప్రారంభించారు. నాడు కొద్దిమంది మద్దతుదారులు, వేలాది మంది 'మరాఠీ మానుస్' సాక్షిగా పురుడుపోసుకున్న ఈ ప్రాంతీయ మహావృక్షం.. రెక్కలు విరిగాయి. నేలకొరగడానికి సిద్ధంగా ఉంది. విచిత్రమేమిటంటే.. బాల్ థాక్రే స్థాపించిన అసలైన 'శివసేన' పేరు, దాని సాంప్రదాయక 'విల్లు-బాణం' గుర్తు ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే వశమయ్యాయి. మరోవైపు ఉద్ధవ్ థాక్రే వద్ద తండ్రి పెట్టిన పార్టీ పేరు కానీ, గుర్తు కానీ మిగల్లేదు. వారి పార్టీ ఇప్పుడు 'శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే)'గా రూపాంతరం చెంది, 'మశాల్' (దివిటీ) గుర్తుతో మనుగడ సాగిస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ దివిటీ సైతం దాదాపు ఆరిపోయే స్థితికి చేరుకుంది. శివసేనను స్థాపించినప్పుడు బాల్ థాక్రే రెండు ప్రధాన ఆశయాలను నిర్దేశిరచుకున్నారు. ఒకటి 'మరాఠీ అస్తిత్వం', రెండోది 'హిందుత్వ సిద్ధాంతం'. కానీ నేడు ఉద్ధవ్ థాక్రే తన తండ్రి నుంచి వచ్చిన ఈ రెండు రాజకీయ వారసత్వాలను కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడాల్సి వస్తోంది. బాల్ థాక్రే హయాంలో శివసేన సాధించిన శిఖరాగ్రాల నుంచి ఉద్ధవ్ హయాంలో ఎదుర్కొంటున్న జీవన్మరణ పరిస్థితి వరకు అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. 1992 జూలై 18న శివసేనలో జరిగిన ఘటన సంచనలంగా మారింది. బాల్ థాక్రే పార్టీని ఒక సొంత ఆస్తిలా చూస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో కలత చెందిన బాల్ థాక్రే, పార్టీ ముఖపత్రం 'సామ్నా'లో ఒక వ్యాసం రాస్తూ.. తాను శివసేన నుంచి తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ఈ వార్తతో మహారాష్ట్రవ్యాప్తంగా ఉన్న శివసైనికుల్లో తీవ్ర కలకలం రేగింది. ముంబైలోని శివసేన ప్రధాన కార్యాలయం వెలుపల లక్షలాది మంది సైనికులు తరలివచ్చి.. 'బాలాసాహెబ్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి' అని కన్నీటితో వేడుకున్నారు. శివసైనికులకు తనపై ఉన్న ఆ అచంచలమైన ప్రేమాభిమానాలను చూసి బాల్ థాక్రే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోక తప్పలేదు. బాల్ థాక్రే బతికున్నంత కాలం మహారాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువు వారి నివాసమైన 'మాతోశ్రీ' మాత్రమే. శివసేన అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ముంబై నగర రిమోట్ కంట్రోల్ బాలాసాహెబ్ చేతుల్లోనే ఉండేది. 'మాతోశ్రీ' నుంచి చిన్న సంకేతం వస్తే చాలు.. ముంబై స్థంభించిపోయేది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం స్వయంగా ముంబై పోలీసులు సైతం శివసేన ప్రముఖుడిని అభ్యర్థించాల్సిన పరిస్థితి ఉండేది. కోవిడ్ లాక్‌డౌన్ కంటే ముందే.. ముంబై లోకల్ రైళ్లకు బ్రేక్ వేయగల ఏకైక శక్తి బాల్ థాక్రేకే ఉండేదని ఇప్పటికీ ముంబై ప్రజలు చెప్పుకుంటారు. కానీ, నేడు బాల్ థాక్రే శతాబ్ది జయంతి ఉత్సవాల వేళ, ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని పార్టీ రెండోసారి ఘోరమైన చీలికను ఎదుర్కొంటోంది. ఆయన కుడిభుజం లాంటి సంజయ్ రౌత్ కేవలం ప్రత్యర్థులపై వీధి రౌడీల తరహాలో విమర్శలు చేయడానికే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాల్ థాక్రేకు, ఉద్ధవ్ థాక్రేకు రాజకీయ వ్యూహాల్లోనూ, వ్యక్తిత్వంలోనూ నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. బాల్ థాక్రే తన జీవితంలో ఎన్నడూ అధికార పీఠాన్ని ఆశించలేదు. ఆయన ఎప్పుడూ 'కింగ్' అవ్వాలని అనుకోలేదు, 'కింగ్‌మేకర్' గానే ఉండటానికి ఇష్టపడ్డారు. శివసైనికులు బాలాసాహెబ్ కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడ్డారంటే.. ఆయన దశాబ్దాల పాటు క్షేత్రస్థాయిలో చేసిన పోరాటమే దానికి కారణం. 2003 నుంచి పార్టీలో ఉద్ధవ్ జోక్యం పెరిగిన తర్వాత, శివసేన ఏకంగా నాలుగు సార్లు పెద్ద తిరుగుబాట్లను చవిచూసింది. ఉద్ధవ్‌పై తిరుగుబాటు చేసిన ప్రతి ఒక్కరి వాదన ఒక్కటే.. ఆయనలో బాల్ థాక్రే లక్షణాలు ఏమాత్రం లేవని, అయినా సరే అందరూ తనను బాలాసాహెబ్‌లాగే గౌరవించాలని ఉద్ధవ్ ఆశిస్తారని అసమ్మతి నేతలు ఆరోపిస్తుంటారు. బీజేపీతో కలిసి ఎన్నికల్లో గెలిచిన తర్వాత, ఉద్ధవ్ థాక్రే అనూహ్యంగా ప్లేట్ ఫిరాయించి కాంగ్రెస్, ఎన్సీపీలతో చేతులు కలిపి స్వయంగా ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాకుండా తన సొంత మంత్రివర్గంలో కొడుకు ఆదిత్య థాక్రేకు మంత్రి పదవి కట్టబెట్టారు. ఉద్ధవ్ నిర్ణయాలపై ఆయన భార్య రష్మి థాక్రే, కుమారుడు ఆదిత్య థాక్రే, సంజయ్ రౌత్‌లతో కూడిన ఒక ప్రత్యేక కోటరీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇది బాలాసాహెబ్ ఇమేజ్ ముందు ఉద్ధవ్‌ను

బలహీనంగా మార్చేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తారు. బాల్ థాక్రే బతికుండగానే జరిగిన మొదటి తిరుగుబాటు ఇది. భుజబల్ ఆ తర్వాత కాంగ్రెస్, ఎన్సీపీల ద్వారా రాజకీయాల్లో కొనసాగారు. విచిత్ర మేమిటంటే, ఆ తర్వాత కాలంలో అదే భుజబల్‌ను ఉద్ధవ్ తన మంత్రివర్గంలో చేర్చుకోవాల్సి వచ్చింది.

ఇప్పుడు ఏక్‌నాథ్ షిండేతో మొత్తం శివసేన రూపం మారిపోయింది. అసపలు శివసేనకు షిండే నాయకుడయ్యారు. ఇటీవల ఆరుగురు ఎంపీలు కూడా వెళ్లిపోవడంతో ఉద్ధవ్ శివసేన మరింత బలహీనపడింది.

## హర్మూజ్‌పై పట్టుకోసం ఇరాన్ బెట్టు

- అమెరికన్లను ఎప్పుడూ నమ్మబోమన్న ఇరాన్

టెహ్రాన్,జూన్23 పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలోనూ.. హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ తరచూ ఏదో ఒక ప్రకటన చేస్తూనే ఉన్నాయి. హర్మూజ్ నిర్వహణను ఇరానే చూస్తుందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ జలసంధి.. యుద్ధానికి ముందున్న స్థితికి ఎప్పటికీ తిరిగిరాదన్నారు. మేం అమెరికన్లను ఎన్నడూ నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. భవిష్యత్తులోనూ వారిపట్ల ఆ ధోరణితో ఉండటం సమంజసమే అని ఘాలిబఫ్ అమెరికా పట్ల ఇరాన్‌కున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. స్విట్జర్లాండ్‌లో ఇప్పటికే రెండు దేశాల మధ్య చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఫ్రీజ్ చేసిన 12 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడానికి తుది ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. కాగా.. తమ నుంచి సోయా, మొక్కజొన్న, గోధుమలు కొనేందుకు ఇరాన్ అంగీకరిస్తే.. ఫ్రీజ్ చేసిన ఆ దేశ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్మూజ్‌పై భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ పూర్తిగా తెరిచే ఉందని ప్రకటించారు. ఈ జలసంధికి మరోవైపున ఉన్న ఒమన్ దేశం తాజా పరిణామాలపై స్పందించింది. అంతర్జాతీయ చట్టాలకు, టోల్ రహిత ప్రయాణానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయని పేర్కొంది.

## పాక్, ఖతార్‌లను నమ్మలేం

- ఉగ్రవాదానికి ఊతమిచ్చిన ఘనత వారిది
- బిన్‌లాడెన్‌ను దాచిపెట్టిన చరిత్ర పాక్‌ది
- జెడి వాన్స్ వ్యాఖ్యలపై ఇద్దరు సెనేటర్ల విమర్శలు

వాషింగ్టన్,జూన్23: పాకిస్థాన్‌పై ప్రేమను వ్యక్తం చేస్తూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అమెరికాకు చెందిన ఇద్దరు సెనేటర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ దేశ ఉగ్రచరిత్ర గురించి ప్రస్తావిస్తూ, బిన్ లాడెన్‌ను దాచిన ఘనత పాక్‌దని అన్నారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, ఖతార్ దేశాలపై అమెరికాకు చెందిన ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు రిక్ స్కాట్, టిమ్ షీహీ ఘాటుగా స్పందించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన చరిత్ర ఆ దేశాలకు ఉందంటూ తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. కాగా, అమెరికా- ఇరాన్ శాంతి ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై స్విట్జర్లాండ్‌లో ఇటీవల చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి పాకిస్థాన్, ఖతార్ నాయకులతో వాన్స్ భేటీ అయ్యారు. ఈ

సందర్భంగా 'మేము పాకిస్తాన్‌ను ప్రేమిస్తున్నాం' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్, ఖతార్‌లను నిష్పక్షపాత మధ్యవర్తులుగా చూడకూడదని సెనేటర్ రిక్ స్కాట్ తేల్చి చెప్పారు. మధ్యప్రాచ్యంలో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలే వాషింగ్టన్‌కు నిజమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. ఆ దేశాలనూ అమెరికా చర్చల్లో చేర్చుకోవాలని స్కాట్ సూచించారు. 'మన నిజమైన స్నేహితులు ఎవరో ఇప్పటికే అందరికీ స్పష్టంగా తెలిసి ఉండాలి. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన సుదీర్ఘ చరిత్ర ఖతార్, పాకిస్థాన్‌లకు ఉంది. ప్రస్తుతం వారు అర్థవంతమైన శాంతిని సాధించడం కంటే ఇరాన్ దశాబ్దాల నాటి ఉగ్రవాద ప్రచారాన్ని ప్రోత్సహించడానికే మొగ్గు చూపుతున్నట్లు కనిపిస్తోంది. అందరికీ ప్రయోజనం చేకూర్చే ఆచరణీయమైన ఒప్పందానికి ఇంకా ఆస్కారం ఉంది' అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా మోంటానా సెనేటర్ టిమ్ షీహీ కూడా పాకిస్థాన్‌ను విమర్శించారు. 'పాకిస్థాన్ ఒక దశాబ్దం పాటు బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చిందనే విషయాన్ని మనం మరిచిపోకూడదు. పాకిస్థానీలు ఐఎస్ఐ ద్వారా మాపై పోరాడే వారికి నిధులు సమకూర్చారు. ముఖ్యంగా అయతుల్లాకు నిధులు అందించారు. ఖతార్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థలకు మనీలాండరింగ్ ద్వారా డబ్బును అందిస్తోంది. ఇరాన్, అమెరికా- ఇజ్రాయెల్ శాంతి ఒప్పందంలో పాకిస్థాన్, ఖతార్‌లు పాల్గొంటే.. ఆ చర్చల్లో యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలనూ చేర్చుకోవాలి. మధ్యప్రాచ్యంలో ఆ మూడు దేశాలే అమెరికాకు నిజమైన మిత్రదేశాలు' అని పేర్కొన్నారు. కాగా, వీరి వ్యాఖ్యలు ఇప్పటికే ఉన్న వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయ్యింది.

## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు

- ఫైలింగ్ ఫీజులను 75శాతం పెంచే యోచన

వాషింగ్టన్,జూన్23 అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

## రామగుండం అభివృద్ధికి సహకరించండి

ప్రిన్సిపల్ సెక్రటరీకి రామగుండం మేయర్ వినతి

హైదరాబాద్,జూన్23 :రామగుండం నగర అభివృద్ధికి సహకరించాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ టీ.కే.శ్రీదేవిని నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో ని ఒక హోటల్లో మున్సిపల్ చైర్మన్, కార్పొరేషన్ మేయర్లకు మంగళవారం నిర్వహించిన ఓరియంటేషన్ కు రామగుండం మేయర్ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా పురపాలక శాఖ సెక్రెటరీని కలిసి నగరంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించినట్లు తెలిపారు.

## 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలి

సింగరేణి జాతీయ కార్మిక సంఘాల డిమాండ్

గోదావరిఖని,జూన్23: బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణిలో నాలుగు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్టు నాయకులు వెల్లడించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టీయూసీ నాయకులు జనక్ ప్రసాద్, సీఐటీయూ నాయకులు రాజారెడ్డి హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడారు. జూన్ 30 2026 తో 11వ వేతన ఒప్పంద కాల పరిమితి ముగుస్తుందని 1 జులై 2026 నుంచి 12వ వేతన ఒప్పందం అమలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు కమిటీ వేయలేదని నాయకులు విమర్శించారు. కోల్ ఇండియాలో జులై 1న నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన క్రమంలో సింగరేణి సంస్థలు జూలై 3న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు నాలుగు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేతన ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు వారు వివరించారు. జూలై3న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ తో పాటు రామగుండం, శ్రీరాంపూర్, భూపాలపల్లి, బెల్లంపల్లి డివిజన్లో జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నిరసన తెలియజేయడానికి నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

# గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే అరటి పండ్లు..

**• రోజూ తినాలని చెబుతున్న నిపుణులు..**

చాలా మంది ఆహారంగా తీసుకునే పండ్లల్లో అరటిపండ్లు కూడా ఒకటి. ఇవి తినడానికి సౌకర్యంగా ఉండడంతో పాటు అనేక పోషకాలతో నిండి ఉంటాయి. అరటిపండ్లు చాలా తక్కువ ధరలో విరివిగా లభిస్తూ ఉంటాయి. అరటిపండ్లల్లో శరీరానికి అవసరమయ్యే ఫైబర్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, విటమిన్ బి6, ఫోలేట్ వంటి అనేక పోషకాలు ఉంటాయి. అలాగే వీటిలో క్యాలరీలు కూడా తక్కువగా ఉంటాయి. అరటిపండ్లను తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మానసిక స్థితి సరిగ్గా ఉంటుంది. వ్యాయామం చేసిన తరువాత శరీరానికి కావల్సిన శక్తిని అందించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. అరటిపండ్లను తీసుకోవడం వల్ల శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. వీటితో పాటు అరటిపండ్లు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి.

### రక్తపోటు అదుపులో ఉండేందుకు..

అరటిపండ్లల్లో పొటాషియం ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు స్థాయిలు అదుపులో ఉంటాయి. ఆరోగ్యకరమైన గుండె పనితీరుకు పొటాషియంను తీసుకోవడం చాలా అవసరం. మధ్యస్థంగా ఉండే అరటిపండులో 422.4 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. గుండె ప్రమాదాలకు కారణమయ్యే రక్తపోటును తగ్గించడంలో అరటిపండు ఎంతో సహాయపడుతుంది. అరటిపండ్లల్లో మెగ్నీషియం కూడా ఎక్కువ మొత్తంలో ఉంటుంది. మెగ్నీషియం అనేక శారీరక విధుల్లో కీలక పాత్ర పోషిస్తుంది. గుండెలోని విద్యుత్ ప్రేరణలను నియంత్రించడంలో సహాయపడే ఎలక్ట్రోలైట్ గా పని చేస్తుంది. గుండె స్థిరమైన, క్రమబద్ధమైన హృదయ స్పందలను నిర్వహించడానికి మెగ్నీషియం ఎంతో అవసరం. రక్తపోటును తగ్గించడంలో మెగ్నీషియం ఎంతో సహాయపడుతుంది. అరటిపండ్లను తీసుకోవడం వల్ల తగినంత మెగ్నీషియం లభిస్తుంది. దీంతో రక్తపోటు అదుపులో ఉండడంతో పాటు గుండె ఆరోగ్యంగా ఉంటుంది.



### కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గేందుకు..

అరటిపండ్లల్లో కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడం వల్ల ధమనుల్లో ఫలకాలు ఏర్పడకుండా ఉంటాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు గుండెపై ఒత్తిడి పడకుండా ఉంటుంది. అరటిపండులో విటమిన్ బి6 ఉంటుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్ ల ప్రమాదాన్ని పెంచే హోమోసిస్టీన్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇక అరటిపండ్లల్లో విటమిన్ సి తో పాటు ఫ్లేవనాయిడ్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని, దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దీంతో గుండె జబ్బుల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఈ విధంగా అరటిపండ్లు గుండె ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయని అల్పాహారంగా లేదా స్నాక్ గా కూడా అరటిపండును తీసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.


# గుండె జబ్బులకు ఇవే ప్రధాన కారణాలు..

**• వీటి నుంచి తప్పనిసరిగా బయట పడాల్సిందే..**

నిద్రలేమితో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని చెప్పవచ్చు. నిద్రలేమి కారణంగా అనేక అనారోగ్య సమస్యలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. నిద్రలేమి, అబ్ స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా వంటి రెండు సమస్యలతో బాధపడుతున్న వారిలో అధిక రక్తపోటుతో పాటు గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు పరిశోధనల ద్వారా కనుగొన్నారు. దాదాపు ప్రపంచ వ్యాప్తంగా 32 శాతం మరణాలు నిద్రలేమి కారణంగా వచ్చే గుండెపోటు, స్ట్రోక్ ల కారణంగానే జరుగుతున్నాయని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. నిద్రలేమి , అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా, కోమోర్బిడ్ నిద్రలేమి వంటి సమస్యలతో బాధపడే వారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### నిద్రను కూడా పరిగణనలోకి తీసుకోవాలి..

సాధారణంగా ఈ రెండు సమస్యలను వేర్వేరుగా గుర్తించి చికిత్స చేస్తారు. కానీ చాలా మందికి ఇవి రెండు ఒకేసారి ఉంటున్నాయని ఇవి రెండు కలిసి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయని నిపుణులు తెలియజేస్తున్నారు. నిద్రించే సమయంలో గుండె, రక్తనాళాలు పునరుద్దరణ అవుతాయి. కానీ సరిగ్గా నిద్రపోకపోవడం వల్ల గుండెకు సరైన విశ్రాంతి దొరకదు. రక్తనాళాల పనితీరు దెబ్బతింటుంది. గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇతర హృదయ సంబంధ ప్రమాద కారకాల మాదిరిగానే నిద్రను కూడా పరిగణనలోకి తీసుకోవాలని నిద్రలేమి, స్లీప్ అప్నియాను విడిగా కాకుండా కలిపి అంచనా వేయాలని చెబుతున్నారు. నిద్రలేమి వంటి సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని దీని ద్వారా హృదయ సంబంధ వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. అలాగే వారు గుండె ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు కొన్ని సూచనలు కూడా చేస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడే కొన్ని చిట్కాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



### పండ్లు, కూరగాయలు అవసరం..

గుండె ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాలను తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, గింజలు వంటి సంపూర్ణ ఆహారాన్ని తీసుకోవాలి. ఉప్పు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ట్రాన్స్ ఫ్యాట్స్, చక్కెరలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం తగ్గించాలి. అలాగే రోజూ వ్యాయామం చేయాలి. నడక, సైక్లింగ్, ఈత, యోగా వంటి వ్యాయామాలు చేయాలి. ఇవి రక్తపోటును తగ్గించడంతోపాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ధూమపానాన్ని మానేయాలి. ధూమపానం రక్తనాళాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె కొట్టుకునే వేగాన్ని పెంచుతుంది. ఆక్సిజన్ స్థాయిలు తగ్గేలా చేస్తుంది. కనుక ధూమపానానికి దూరంగా ఉండాలి.

### ఈ పరీక్షలను తరచూ చేయించుకోవాలి..

తరచూ లిపిడ్ ప్రొఫైల్, రక్తపోటు, ఈసీజీ వంటి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. వీటి ద్వారా సమస్యను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవడానికి వీలుగా ఉంటుంది. అలాగే రోజూ రాత్రి 7 నుండి 8 గంటల పాటు నిద్రపోవాలి. దీని వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. మద్యం రక్తపోటును పెంచుతుంది. కనుక మద్యాన్ని తీసుకోవడం పరిమితం చేయాలి. దీని వల్ల గుండెపై ఒత్తిడి తగ్గుతుంది. ఈ విధంగా రోజూ 7 నుండి 8 గంటల పాటు నిద్రపోవడంతో పాటు ఆహారంలో, జీవనశైలిలో తగిన మార్పులు చేసుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.


# డయాబెటిస్ ఉన్నవారు స్ట్రాబెర్రీలను తినవచ్చా..?

**• వైద్యులు ఏమంటున్నారు..?**

ఈ సీజన్ లో లభించే పండ్లల్లో స్ట్రాబెర్రీలు కూడా ఒకటి. వీటి రంగు, రుచి కారణంగా వీటిని చాలా మంది ఇష్టపడతారని చెప్పవచ్చు. అలాగే డెజర్ట్ లల్లో కూడా వీటిని ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు. పిల్లలు కూడా వీటిని ఇష్టంగా తింటూ ఉంటారు. స్ట్రాబెర్రీలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో శరీరానికి అవసరమయ్యే ఎన్నో పోషకాలు ఉంటాయి. అయితే మధుమేహంతో బాధపడే వారు స్ట్రాబెర్రీలను తీసుకోవచ్చా లేదా అనే సందేహం తరచూ కలుగుతూ ఉంటుంది. మధుమేహంతో బాధపడే వారు ఆహారం తీసుకునే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వారు చేసే చిన్న పొరపాట్లు కూడా రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతూ ఉంటాయి. మరి మధుమేహ వ్యాధి గ్రస్తులు స్ట్రాబెర్రీలను తీసుకోవచ్చా.. లేదా.. దీని గురించి వైద్యులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

### మితంగా తీసుకోవచ్చు..

మధుమేహ వ్యాధి గ్రస్తులు మితంగా స్ట్రాబెర్రీలను తీసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. వీటిని రోజూ తీసుకోవడం వల్ల ప్రీ డయాబెటిస్ ఉన్న వారిలో ఫాస్టింగ్ గ్లూకోజ్ స్థాయిలు మెరుగుపడడంతో పాటు వాపును తగ్గించడంలో కూడా ఇవి ఉపయోగపడుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. 12 వారాల పాటు ఒక పెద్ద కప్పు స్ట్రాబెర్రీలను తీసుకోవడం వల్ల యాంటీ ఆక్సిడెంట్లు లభించడంతో పాటు ఆరోగ్యకరమైన గ్లూకోజ్ ప్రతిస్పందనలను కూడా చూడవచ్చని నిపుణులు పరిశోధనల ద్వారా వెల్లడించారు. స్ట్రాబెర్రీలు పోషకాలను కలిగి ఉండడంతో పాటు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయని ఇవి రక్తంలో చక్కెర స్థాయిల్లో వచ్చే హెచ్చు తగ్గులను తగ్గించడంలో సహాయపడతాయని వైద్యులు తెలియజేస్తున్నారు. స్ట్రాబెర్రీల్లో విటమిన్ సి తో పాటు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇవి చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడతాయి.




### అనేక ఉపయోగాలు..

వీటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అలాగే స్ట్రాబెర్రీల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. దీంతో చక్కెర స్థాయిలు ఒకేసారి పెరగకుండా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఇతర చిరుతిళ్లను తీసుకోకుండా ఉండవచ్చు. స్ట్రాబెర్రీల్లో విటమిన్ సితో పాటు ఆంథోసైనిన్లు కూడా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంతో పాటు వాస్కులర్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా దోహదపడతాయి. వీటిని తీసుకోవడం వల్ల భవిష్యత్తులో డయాబెటిస్ బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయి. స్ట్రాబెర్రీలను నిరంతరం తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిలు తగ్గుతాయి. దీంతో డయాబెటిస్ బారిన పడే ప్రమాదం తగ్గుతుంది. ఈ విధంగా డయాబెటిస్ తో బాధపడే వారికి స్ట్రాబెర్రీలు ఎంతో మేలు చేస్తాయని వీటిని మితంగా తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. స్ట్రాబెర్రీలు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ వీటిని మితంగా తీసుకోవడం చాలా అవసరం. రోజూ ఒక కప్పు మోతాదులో మాత్రమే వీటిని తీసుకునే ప్రయత్నం చేయాలి. వీటిని ప్రోటీన్ లేదా ఆరోగ్యకరమైన కొవ్వులతో తీసుకోవడం మంచిది. శుద్ధి చేసిన చక్కెరలు, కార్బొహైడ్రేట్స్ ఉండే స్ట్రాబెర్రీ ఆధారిత డెజర్ట్ లను తీసుకోకూడదు. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను మరింతగా పెంచుతాయి. అలాగే ప్రాసెస్ చేసిన వాటి కంటే తాజా స్ట్రాబెర్రీలను ఎంచుకుని తినడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

## భోజనం చేసిన తరువాత ఈ సమస్యలు వస్తున్నాయా..?

**• దానికి కారణం ఏమిటో, ఎలా నివారించాలో తెలుసుకోండి..!**



తేలికపాటి లేదా భారీ భోజనం చేసిన తరువాత చాలా మంది తీవ్రమైన ఉబ్బరం, మలబద్దకం వంటి జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారని ఇటీవలి అధ్య యనాలు చెబుతున్నాయి. ఇటువంటి అసౌకర్యానికి ప్రధాన కారణం SIBO (Small Intestinal Bacterial Overgrowth) అని వైద్యులు చెబుతున్నారు. SIBO అనేది పెద్ద ప్రేగులో ఉండే బ్యాక్టీరియా చిన్న ప్రేగులో ఎక్కువగా పెరగడం. చిన్న ప్రేగు ఆహారాన్ని జీర్ణం చేయటంతో పాటు పోషకాలను శరీరం గ్రహించేలా చేయడం, ఆహారాన్ని ముందుకు కదిలించడం వంటి పనులను నిర్వర్తిస్తుంది. చిన్న ప్రేగులో ఈ బ్యాక్టీరియా ఎక్కువగా ఉండడం వల్ల ఆహారం ఎక్కువగా ఫెర్మెంటేషన్ అవుతుంది. పోషకాలు శరీరానికి అందకకుండా పోతాయి. గ్యాస్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. దీని వల్ల పొట్ట ఉబ్బరం, మలవిసర్జనలో మార్పులు, కడుపు నొప్పి, అలసట, పొట్ట పెద్దగా కనిపించడం, గ్యాస్, మలబద్దకం, విరేచనాలు, తక్కువ తిన్నా కూడా పొట్ట నిండిన భావన కలగడం, పోషకాల లోపాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా కొన్ని సందర్భాల్లో మెదడు మబ్బుగా ఉండడం, ఆందోళన, చర్మ సమస్యలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇక SIBO కు గలకారణాలను ఇప్పుడు తెలుసుకుందాం.

### కారణాలు ఇవే..

దీర్ఘకాలిక ఒత్తిడి, డయాబెటిస్, హైపో థైరాయిడిజం, వృద్ధాప్యం, ఇన్ఫెక్షన్ కారణంగా జీర్ణాశయ సామర్థ్యం తగ్గుతుంది. దీని వల్ల ఆహారం లేదా బ్యాక్టీరియా చిన్న ప్రేగులోనే నిలిచిపోతాయి. దీర్ఘకాలం పాటు పీపీఐ మందులు వాడటం, వయసు పెరగడం లేదా జింక్ లోపం కారణంగా కడుపులో ఆమ్లం తగ్గుతుంది. ఆమ్లం తక్కువవడం చేత బ్యాక్టీరియా చనిపోకుండా చిన్న ప్రేగులోకి చేరతాయి. అలాగే బైల్ లేదా ఎంజైమ్ ల ప్రవాహం తక్కువైతే ఆహారం పూర్తిగా జీర్ణం కాకుండా మిగిలిపోతుంది. దీంతో బ్యాక్టీరియా ఎక్కువగా పెరుగుతుంది. పాత శస్త్రచికిత్సలు, IBS లేదా ఎఅజవతీఅఎబశ్రీఖ వంటి సమస్యలు చిన్న ప్రేగులో బ్యాక్టీరియాను చిక్కుకునేలా చేస్తాయి. ఇక SIBO ను బ్రీత్ టెస్ట్ ద్వారా గుర్తిస్తారు. ఇందులో వ్యక్తికి గ్లూకోజ్ కలిపిన ద్రవణాన్ని తాగిస్తారు. కొద్ది సమయం తరువాత శ్వాస నమూనాలను తీసుకుని పరీక్షిస్తారు.

### ఏం చేయాలి..

SIBO తో బాధపడే వారు కొన్నిసార్లు ప్రోబయోటిక్స్ తీసుకోవడం వల్ల లక్షణాలు మరింత పెరిగే అవకాశం ఉంది. కనుక ఆహార నియంత్రణ, ఫెర్మెంటేషన్ ను తగ్గించడం, కడుపులో ఆమ్లాన్ని మెరుగుపరచడం, ఎంజైమ్ లు, బైల్ సరైన స్థాయిలో ఉండేలా చేయడం, బ్యాక్టీరియా అధిక వృద్ధిని తగ్గించడానికి హెర్బల్ లేదా ఔషధ యాంటీమైక్రోబియల్స్ ను ఉపయోగించడం, జీర్ణాశయ సామర్థ్యాన్ని పునరుద్ధరించడం, జీర్ణాశయ లైనింగ్‌ను బలపరచడం వంటివి చేయాలి. వా×దీూ తగ్గిన తర్వాత మాత్రమే ప్రోబయోటిక్స్ వాడడం మంచిది. ఈ విధంగా తగిన చర్యలు తీసుకుంటూ మెరుగైన చికిత్స తీసుకోవడం ద్వారా ఈ సమస్య నుండి బయటపడవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

## జీఎల్‌పీ-1 మందులను వాడడం ఆపేశారా.. అయితే ఇంకా ఎక్కువ బరువు పెరుగుతారట..

అధిక శరీర బరువు కారణంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్న సంగతి అందరికీ తెలిసిందే. దీంతో చాలా మంది శరీర బరువును తగ్గించుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిలో బరువు తగ్గే ఇంజెక్షన్ లను వాడడం కూడా ఒకటి. ఇవి బరువు తగ్గడంలో చాలా సహాయపడతాయి. సెమాగ్లుటైడ్, టిర్జెపటైడ్ వంటి మందులు ఆకలిని తగ్గిస్తాయి. పొట్ట ఖాళీ అవ్వడాన్ని తగ్గిస్తాయి. జీవక్రియ నియంత్రణను మెరుగుపరుస్తాయి. దీంతో సులభంగా బరువు తగ్గవచ్చు. అయితే ఈ మందుల వాడకం ఆగిన తరువాత ప్రయోజనాలు త్వరగా తగ్గుతాయని కొత్త పరిశోధనలు తెలియజేస్తున్నాయి.

### మొదటి సంవత్సరంలో మళ్లీ బరువు పెరుగుదల..

ఈ మందులు వాడడం ఆపిన తరువాత చాలా మంది త్వరగా బరువు తిరిగి పొందుతారని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. చికిత్స ఆపేసిన తరువాత మొదటి సంవత్సరంలోనే కోల్పోయిన బరువులో ఎక్కువ భాగాన్ని తిరిగి పొందుతారని, ఊబకాయం ఒక దీర్ఘకాలిక వ్యాధిలా ప్రవర్తిస్తుందని నిపుణులు చెబుతున్నారు. చికిత్స ఆపిన తరువాత వ్యక్తులు నెలకు దాదాపు 0.4 కిలోల బరువు తిరిగి పొందుతున్నారని 9వేల మందికి పైగా జరిపిన పరిశోధనల్లలో వెల్లడైంది. చాలా మంది 1.7 సంవత్సరాలలోపే వారి కోల్పోయిన బరువును తిరిగి పొందుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

### బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ అటాక్..

బరువు తగ్గే ఇంజెక్షన్ లను వాడడం ఆపిన తరువాత శరీరం సహజ ఆకలి సంకేతాలు, జీవక్రియ వేగం తిరిగి మామూలు స్థితికి చేరుకుంటాయి. దీంతో క్రమంగా బరువు తిరిగి పెరుగుతారు. బరువు తిరిగి పెరిగే సరికి చాలా మందిలో రక్తపోటు, చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్ వంటి జీవక్రియ మెరుగుదలలు తగ్గడం ప్రారంభించాయని కూడా వైద్యులు పరిశోధనల ద్వారా తెలియజేస్తున్నారు. అంతేకాకుండా ఆహారాల ద్వారా చేసే డైటింగ్ తరువాత పెరిగే బరువు కంటే మందులు ఆపేసిన తరువాత వేగంగా బరువు పెరుగుతున్నారని విశ్లేషణ సూచించింది. జీఎల్‌పీ - 1 వంటి మందులు మెదడులో ఆకలి సంకేతాలను మారుస్తాయి. ఎక్కువ సమయం కడుపు నిండిన భావన కలిగి ఉండడానికి, తక్కువ ఆహారాన్ని తీసుకోవడానికి ఇవి సహాయపడతాయి. వీటిని తీసుకోవడం మానేసిన తరువాత ఆకలి సంకేతాలు మామూలు స్థితికి వస్తాయి. దీంతో ఆకలి పెరగడంతో పాటు క్యాలరీలు తీసుకోవడం పెరుగుతుంది.

### ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం..

బరువు తగ్గడానికి వాడే మందులు శక్తివంతంగా ఉన్నప్పటికి, స్థిరమైన ఫలితాలు, దీర్ఘకాలిక ప్రవర్తనా మార్పులపై ఆధారపడి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లు, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం వల్ల మందులు ఆపేసిన తరువాత కూడా బరువు తగ్గడాన్ని ఎక్కువ కాలం పాటు నిలుపుకోవచ్చని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. బరువు తగ్గించే మందులు ఊబకాయం చికిత్సలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చినప్పటికీ చికిత్స నిలిపివేస్తే ప్రయోజనాలు కొనసాగకపోవచ్చని కోల్పోయిన బరువును సంవత్సరం లోపే తిరిగి పొందుతున్నారని నిపుణులు చెబుతున్నారు. స్థిరమైన బరువుకు వైద్య చికిత్స, ప్రవర్తన మద్దతు, దీర్ఘకాలిక జీవనశైలి మార్పుల కలయిక అవసరమని వైద్యులు తెలియజేస్తున్నారు.

## పెద్ది తరవాత బుచ్చిబాబులో మార్పు

- కొత్త సినిమా కోసం వేగం పెంచాలని నిర్ణయం



టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సాన గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించే దర్శకుల కంటే, కథను పూర్తిగా సిద్ధం చేసి, ప్రతి అంశాన్ని పక్కాగా మలిచిన తర్వాతే సెట్స్‌పైకి తీసుకెళ్లే దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇప్పుడు బుచ్చిబాబు తన పని విధానంలో కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా తర్వాత వెంటనే కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించకుండా, తన రెండో చిత్రానికి అవసరమైన కథ, పాత్రలు, ప్రీ-ప్రొడక్షన్ పనులపై చాలా సమయం కేటాయించారు. దీంతో 'ఉప్పెన' తర్వాత ఆయన తదుపరి చిత్రం కోసం అభిమానులు, సినీ పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. చివరకు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. 'పెద్ది' విజయం బుచ్చిబాబు కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలతో కూడిన కథనం, పాత్రల రూపకల్పన, విజువల్ ట్రీట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, భావోద్వేగాలను తెరపై ఆవిష్కరించే విధానానికి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. గతంతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే తన తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక దర్శకుడు వరుస విజయాలను కొనసాగించాలంటే తక్కువ వ్యవధిలోనే కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించడం కూడా కీలకంగా మారింది. ఈ విషయాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి కథా రచన, ప్రీ-ప్రొడక్షన్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి తదుపరి సినిమాను త్వరగా పట్టాలెక్కించాలని ఆయన భావిస్తున్నారని సమాచారం.

## బాహుబలి: ది ఎటర్నల్ వార్

- కీలక అప్‌డేట్‌ను అందించిన ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ అందించారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ప్రభాస్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యానిమేషన్ రూపంలో ప్రభాస్ యోధుడి అవతారంలో కనిపించడం అభిమానులకు గూస్‌బంప్స్ కలిగిస్తోంది. 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యానిమేషన్ ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌లోని 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఎంపిక కావడం భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ ఫెస్టివల్‌లో నిర్వహించే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యానిమేషన్ రంగానికి చెందిన ప్రముఖులు, స్టూడియోలు, నిర్మాతలు, దర్శకుల సమక్షంలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించబడనుండటం విశేషం. ప్రభాస్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఆయన చేసిన పోస్ట్ కొద్ది నిమిషాల్లోనే లక్షలాది లైక్స్, వేలాది కామెంట్లను సొంతం చేసుకుంది. ఈ యానిమేషన్ చిత్రాన్ని ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌కు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ యానిమేషన్ దర్శకుడు ఇషాన్ శుక్లా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రభాస్ తన పోస్ట్‌లో .. బాహుబలి: ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్ అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా అద్భుతమైన పనిని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని పేర్కొన్నారు.

## ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా ?




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్ వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ లాంగ్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే జరిగితే, 'ఎకె 47' చిత్రాన్ని ఏకంగా 2027 సమ్మర్ సీజన్‌కు మాత్రమే పోస్ట్‌పోన్ చేసే అవకాశాలు ఉన్నట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది.

# మా ఇంటి బంగారాన్ని అభినందించిన మెగాస్టార్



స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలైన తర్వాత మంచి స్పందనను అందుకుంటోంది. దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం అనంతరం సమంత నటించిన తొలి సినిమా కావడంతో ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. జూన్ 19న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి వసూళ్లను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. సమంత, రాజ్ నిడిమోరు దంపతులతో పాటు దర్శకురాలు నందిని రెడ్డి, చిత్ర యూనిట్ సభ్యులను తన నివాసానికి ఆహ్వానించిన ఆయన, సినిమా విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. సినిమా చూసిన అనంతరం చిరంజీవి తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, మా ఇంటి బంగారం చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఉమ్మడి కుటుంబం నేపథ్యంలో యాక్షన్, భావోద్వేగాలను అందంగా మేళవిస్తూ దర్శకురాలు నందిని రెడ్డి తనదైన శైలిలో వినోదాత్మకంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు అని పేర్కొన్నారు. అలాగే సమంత నటనను ప్రత్యేకంగా ప్రశంసించిన ఆయన, సమంత నటన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా చీరకట్టులో ఆమె చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇటువంటి మహిళా ప్రాధాన్య చిత్రాలు తెలుగు సినీ పరిశ్రమకు అవసరం. ఈ విజయానికి సమంత, నందిని రెడ్డి, రాజ్ మరియు మొత్తం చిత్ర బృందానికి హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. మరోవైపు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తున్న సమంత, రాజ్ దంపతులకు ప్రత్యేక అభినందనలు అని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి సతీమణి సురేఖ సమంత దంపతులకు కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించారు. ఈ కామెంట్ ప్రస్తుతం



సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ముఖ్యంగా 'కొత్త అధ్యాయం' అనే పదం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. దీనిపై సోషల్ మీడియాలో పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. సమంత ప్రగ్నెన్సీ విషయంలో చిరు ఈ కామెంట్ చేశారా అని పలువురు ముచ్చటించుకుంటున్నారు. ఇక జూన్ 19న విడుదలైన 'మా ఇంటి బంగారం' మొదటి రోజునుంచే ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ముఖ్యంగా సమంత నటన, భావోద్వేగ సన్నివేశాలు, కుటుంబ నేపథ్యం, యాక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ






ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడు దలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'స్పిరిట్', 'ఫౌజీ', 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.

# వారసత్వం ఉన్నా... కష్టపడితేనే ఫలితం

**ప్రేక్షకులు ఊరికే ఆదరిస్తానుకోరాదు**

**నటుడు రామ్ చరణ్**

సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ నటుడి నటను చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు. నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి అని చెప్పారు.ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం' అని రామ్ చరణ్ తెలిపారు.

# చరిత్ర సృష్టించిన లియోనెల్ మెస్సీ..



లియోనెల్ మెస్సీ ఫుట్‌బాల్ చరిత్రలో మరో అద్భుత మైలురాయిని అందుకున్నాడు. జూన్ 22, 2026న ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ జెలో ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్‌లో అర్జెంటీనా కెప్టెన్ రెండు గోల్స్ కొట్టి పురుషుల వరల్డ్ కప్ ఆల్ టైమ్ అత్యధిక గోల్స్ రికార్డును బద్దలు చేశాడు. ఇంతకుముందు జర్మనీ లెజెండ్ మిరోస్లావ్ క్లోజ్ 16 గోల్స్‌తో రికార్డు సృష్టించాడు. మెస్సీ ఈ మ్యాచ్‌లో 17వ గోల్‌తో ఆ రికార్డును సమం చేసి, 18వ గోల్‌తో దాటేశాడు. మ్యాచ్ డల్లాస్‌లోని స్టేడియంలో జరిగింది. మెస్సీ తొలుత పెనాల్టీ కిక్ మిస్ చేశాడు కానీ 38వ నిమిషంలో ఫకుండో మెడినా పాస్‌ను లెఫ్ట్ ఫుట్‌తో అందుకుని అద్భుత గోల్ చేశాడు. ఇది అతని 17వ వరల్డ్ కప్ గోల్. అప్పటికే అల్జీరియాపై హ్యాట్రిక్‌తో 16 గోల్స్ సాధించి క్లోజ్‌ను సమం చేశాడు. ఇన్జ్యూరీ టైమ్‌లో (90ం5') మరో గోల్ చేసి రికార్డును తనదిగా చేసుకున్నాడు. అర్జెంటీనా 2–0తో విజయం సాధించి నాకౌట్ స్టేజ్‌కు అర్హత సాధించింది. ఈ విజయంతో మెస్సీ వరల్డ్ కప్‌లో అత్యధిక విజయాలు, అత్యధిక మ్యాచ్‌లు, అత్యధిక నిమిషాలు వంటి ఇతర రికార్డులను కూడా విస్తరించాడు. మెస్సీ ఈ టోర్నమెంట్‌లో ఇప్పటికే 5 గోల్స్ చేశాడు. అతను 6వ వరల్డ్ కప్ ఆడుతున్న మొదటి ఆటగాడు. 38 ఏళ్ల వయసులో కూడా అతని ప్రదర్శన అద్భుతం. ఇంతకుముందు 2022లో వరల్డ్ కప్ గెలిచిన అర్జెంటీనా బ్యాక్ టు బ్యాక్ టైటిల్ కోసం ఆశలు కలిగించింది. మెస్సీ తండ్రి ఆరోగ్య సమస్యలు ఉన్నా, అతను జట్టుకు నాయకత్వం వహించి చరిత్ర సృష్టించాడు. ఇంటర్నేషనల్ గోల్స్‌లో క్రిస్టియానో రోనాల్డో (143) తర్వాత 121 గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ సాధనకు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు, మాజీ ఆటగాళ్లు అభినందించారు. జ్లాటన్ ఇబ్రాహిమోవిక్, థియెర్రీ హెన్రీ వంటి లెజెండ్స్ మెస్సీ గ్రేట్‌నెస్‌ను ప్రశంసించారు. వికీపీడియా, మెస్సీ ఇప్పుడు 18 గోల్స్‌తో టాప్ స్కోరర్. మహిళల వరల్డ్ కప్ రికార్డు హోల్డర్ మార్టా (17)ను కూడా దాటేశాడు. అర్జెంటీనా గ్రూప్ జెలో 6 పాయింట్లతో టాప్‌లో ఉంది. మెస్సీ చిన్న వయసు నుంచి రికార్డులు బద్దలు చేస్తున్నాడు. 2006లో మొదటి వరల్డ్ కప్ గోల్ చేశాడు. ఇప్పుడు 6 ఎడిషన్లలో ఆడి చరిత్ర సృష్టించాడు. అతని సాంకేతిక నైపుణ్యం, లీడర్‌షిప్, హ్యూమిలిటీ అభిమానులను ఆకర్షిస్తున్నాయి. ఈ రికార్డు ఫుట్‌బాల్ ప్రపంచానికి మెస్సీ అని మరోసారి నిరూపించింది. అర్జెంటీనా జట్టు ఆటగాళ్లు ఎంజో ఫెర్నాండెజ్ వంటి వారు మెస్సీని ఆనందంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ విజయం అర్జెంటీనా ఫుట్‌బాల్ అభిమానులకు పండగ. బ్యూనస్ ఎయిర్స్‌లో సెలబ్రేషన్స్ జరిగాయి. మెస్సీ తన 39వ పుట్టినరోజు సమీపంలో ఈ రికార్డు సాధించడం ప్రత్యేకం. ఫిఫా, అంతర్జాతీయ మీడియా ఈ సాధనను ప్రధాన హైలైట్‌గా ప్రచురించింది. మెస్సీ ఇంకా ఎన్నో రికార్డులు సాధించాలని అభిమానులు ఆశిస్తున్నారు. అతని కెరీర్ ఇంకా కొనసాగుతుందని భావిస్తున్నారు. మొత్తంమీద ఈ ఈవెంట్ ఫుట్‌బాల్ ప్రపంచాన్ని మెస్సీ మాయాజాలంలో ముంచేసింది. అతని అంకితభావం, నైపుణ్యం యువ ఆటగాళ్లకు స్ఫూర్తి. అర్జెంటీనా జట్టు బ్యాక్ టు బ్యాక్ వరల్డ్ కప్ గెలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ చరిత్రాత్మక సాధన ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

# పద్మశ్రీ అవార్డు అందుకున్న రోహిత్ శర్మ



టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ అవార్డును అందుకున్నాడు. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అవార్డుల పురస్కార కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ అత్యున్నత పురస్కారాన్ని హిట్ మ్యాన్ స్వీకరించాడు. ఈ కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువు కేంద్ర మంత్రులు, ప్రముఖులు, అవార్డు గ్రహితలు హాజరయ్యారు. రోహిత్ శర్మ కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా రోహిత్ శర్మ అవార్డు స్వీకరించే క్రమంలో అతని సతీమణి రితికా సజ్దే సంతోషం వ్యక్తం చేస్తూ కనిపించారు. క్రికెట్‌లో దేశానికి అందించిన సేవలు గానూ రోహిత్ శర్మను ఈ అవార్డు వరించింది. క్రీడా అత్యున్నత పురస్కారమైన ఖేల్ రత్న అవార్డును కూడా రోహిత్ శర్మ ఇప్పటికే అందుకున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ మెరుగైన ప్రదర్శన చేశాడు. తొలి మ్యాచ్‌లో విఫలమైనా తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో సత్తా చాటాడు. ఇంగ్లండ్ పర్యటనలో జరిగే వన్డే సిరీస్‌తో రోహిత్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 65 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు అందజేశారు. ఈ విడతలో మొత్తం 2 పద్మ విభూషణ్, 7 పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. సినీ, సాహిత్య, వైద్య, క్రీడా తదితర రంగాల్లో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులు అవార్డులు దక్కాయి. మలయాళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ పురస్కారం లభించగా.. ప్రముఖ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడుకు కూడా పద్మభూషణ్ అవార్డు దక్కింది. తెలుగు సినీ రంగానికి చెందిన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌తో పాటు నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారాలు దక్కాయి. దేశ అభివృద్ధికి, తమ తమ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తులను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోంది.

# వరల్డ్ నెంబర్ వన్ బౌలర్‌గా శ్రీచరణి



భారత స్పిన్నర్, తెలుగు తేజం శ్రీచరణి చరిత్ర సృష్టించింది. వరల్డ్ నెంబర్ వన్ టీ20 బౌలర్‌గా నిలిచింది. ఈ ఘనతను అందుకున్న తొలి తెలుగు మహిళా క్రికెటర్‌గా శ్రీచరణి గుర్తింపు పొందింది. ఐసీసీ తాజాగా విడుదల చేసిన మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో శ్రీచరణి అగ్రస్థానాన్ని అందుకుంది. ఇంగ్లండ్ స్పిన్నర్ లిన్సే స్మిత్‌ను అధిగమించి ఈ ఫీట్ సాధించింది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో మూడు మ్యాచ్‌లు ఆడిన శ్రీచరణి 10 వికెట్లు పడగొట్టింది. గతేడాది జూన్ 28న ఇంగ్లండ్‌తో మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ టీ20ల్లోకి అడుగుపెట్టిన శ్రీచరణి.. అనతికాలంలోనే వరల్డ్ నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచింది. గతేడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో శ్రీచరణి 14 వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. భారత సీనియర్ స్పిన్నర్ దీప్తి శర్మ మూడు స్థానాలు దిగజారి 8వ ర్యాంకులో నిలిచింది. పాకిస్థాన్‌పై ఐదు వికెట్ల ఘనత సాధించినా.. దీప్తి శర్మ టాప్–5 ప్లేస్ కోల్పోయింది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ బౌలర్‌గా నిలిచిన శ్రీచరణిని ఏపీ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. సోషల్ మీడియా వేదికగా శ్రీచరణిపై ప్రశంసల జల్లు కురిపించారు. గతేడాదే శ్రీచరణితో మాట్లాడానని, క్రికెట్‌లోకి అడుగుపెట్టిన తొలినాళ్లలో తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి ఆమె చెప్పిన విషయాలు ఇంకా గుర్తున్నాయని తెలిపారు. ప్రతిభ, పట్టుదల, కఠోర శ్రమ ఉంటే.. ప్రతిఫలం తప్పక లభిస్తుందని చెప్పడానికి శ్రీచరణి నిదర్శనమన్నారు. యావత్ రాష్ట్రం శ్రీచరణిని చూసి గర్విస్తోందని, మరిన్ని రికార్డులు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్, నెదర్లాండ్స్‌పై భారీ విజయాలు సాధించిన భారత్.. సౌతాఫ్రికా చేతిలో ఓటమిపాలైంది. భారత జట్టు తమ తదుపరి మ్యాచ్‌లను బంగ్లాదేశ్‌తో పాటు పటిష్టమైన ఆస్ట్రేలియాలతో ఆడాల్సి ఉంది. భారత్ సెమీస్ చేరాలంటే.. పటిష్టమైన ఆస్ట్రేలియాను భారత మహిళల జట్టు ఓడించాలి. లేదంటే సెమీస్ అవకాశాలు సంక్లిష్టంగా మారుతాయి. జూన్ 25న బంగ్లాదేశ్‌తో, జూన్ 28న ఆస్ట్రేలియాతో భారత తమ చివరి లీగ్ మ్యాచ్‌లను ఆడనుంది.

# యశస్వి జైస్వాల్‌పై కన్నేసిన ముంబై ఇండియన్స్


ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు తమ జట్లను బలోపేతం చేయడంపై ఫ్రాంచైజీలు దృష్టిసారించాయి. ప్లేయర్స్ ట్రేడింగ్ విండో ఓపెన్ కావడంతో ఫ్రాంచైజీలు తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం బేరసారాలు మొదలుపెట్టాయి. ఇప్పటికే ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ ప్లేయర్ స్వాప్ డీల్‌ను పూర్తి చేసుకున్నాయి. లక్నో సూపర్ జెయింట్స్ మాజీ కెప్టెన్ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి రీఎంట్రీ ఇవ్వగా.. అందుకు ప్రతీగా కుల్దీప్ యాదవ్ లక్నో టీమ్‌లోకి వెళ్లిపోయాడు. ఈ స్వాప్ డీల్ విషయాన్ని ఐపీఎల్ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఈ స్వాప్ డీల్ నేపథ్యంలో మరో బిగ్ డీల్ గురించి సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చ జరుగుతోంది. రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌పై ముంబై ఇండియన్స్ కన్నేసినట్లు తెలుస్తోంది. ముంబై ఇండియన్స్‌ను వీడేందుకు సిద్దమైన హార్దిక్ పాండ్యా కోసం రాజస్థాన్ రాయల్స్ ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ప్లేయర్ ట్రేడ్ విండో ద్వారా హార్దిక్ పాండ్యాను తీసుకునేందుకు ముంబై ఇండియన్స్‌ను రాజస్థాన్ రాయల్స్ సంప్రదించినట్లు ఓ క్రికెట్ వెబ్‌సైట్ పేర్కొంది. అయితే ఇదు అదునుగా భావించిన ముంబై ఇండియన్స్.. హార్దిక్ పాండ్యాకు బదులుగా యశస్వి జైస్వాల్‌ను ఇవ్వాలని కండిషన్ పెట్టినట్లు తెలుస్తోంది. యశస్వి జైస్వాల్‌ను అడగడంతో రాజస్థాన్ రాయల్స్ పునరాలోచనలో పడినట్లు సమాచారం. మరోవైపు యశస్వి జైస్వాల్ కూడా రాజస్థాన్ రాయల్స్ జట్టును వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో యశస్వి జైస్వాల్ అనవసర ఒత్తిడికి గురవుతున్నాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా వైభవ్ సూర్యవంశీ ధాటికి యశస్వి జైస్వాల్‌కు తగిన గుర్తింపు కూడా దక్కడం లేదు. ఈ క్రమంలోనే వీలైనంత త్వరగా రాజస్థాన్ రాయల్స్‌ను యశస్వి జైస్వాల్ వీడాలని వీరేంద్ర సెహ్వాగ్, అంబటి రాయుడు వంటి మాజీ క్రికెటర్లు సూచించారు. ముంబై ఇండియన్స్‌లోకి వెళ్లే అవకాశం వస్తే యశస్వి జైస్వాల్ కళ్లు మూసుకొని వెళ్తాడని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టుకే ఆడే యశస్వి జైస్వాల్.. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌లో చేరితే అతని విలువ రెట్టింపు కానుంది.

# తీవ్ర భావోద్వేగానికి గురైన వైభవ్ సూర్యవంశీ




ఇండియా క్రికెట్ హిస్టరీలో సరికొత్త సంచలనం సృష్టిస్తున్న 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంటర్నేషనల్ కెరీర్ లో బిగ్గెస్ట్ మైలురాయిని అందుకున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లే సీనియర్ టీ20 స్క్వాడ్‌కు అజిత్ అగార్కర్ సెలెక్షన్ కమిటీ వైభవ్‌ను ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. జూన్ 26 నుంచి ఐర్లాండ్ సిరీస్ స్టార్ట్ అవ్వబోతుండగా, హోటల్ రూమ్‌లో వైభవ్‌కు టీమిండియా అఫీషియల్ జెర్సీని అందజేశారు. దీనికి సంబంధించిన ఎమోషనల్ వీడియోను బీసీసీఐ తన అఫీషియల్ హ్యాండిల్‌లో షేర్ చేసింది. టీమ్ ప్రసిద్ధ త్రోడౌన్ స్పెషలిస్ట్ రఘు స్వయంగా వైభవ్ రూమ్‌కు వెళ్లి కిట్ బాక్స్ ఇచ్చాడు. రఘును చూడగానే వైభవ్ ఎంతో వినయంగా అతని పాదాలకు నమస్కరించి బ్లెస్సింగ్స్ తీసుకోవడం ఫ్యాన్స్ మనసులను గెలుచుకుంది. జెర్సీని చేతిలోకి తీసుకున్న తర్వాత వైభవ్ సూర్యవంశీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. "నిజంగా ఈ అనుభూతిని చెప్పడానికి మాటలు రావడం లేదు. ఏ కల కోసమైతే నేను ఫస్ట్ డే బ్యాట్ పట్టుకుని ప్రాక్టీస్ కోసం క్రికెట్ గ్రౌండ్‌కు వెళ్లానో, ఆ డ్రీమ్ ఈరోజు నెరవేరింది. నా లైఫ్ లో మోస్ట్ ఇంపార్టెంట్ స్టెప్ కంప్లీట్ అయింది. ఇది ఒక కలలా అనిపిస్తోంది. ఆ బ్లూ టీషర్ట్ పై నా పేరు చూడగానే ముఖంలో నవ్వు ఆపుకోలేకపోయా. కొన్నిసార్లు మనం అస్సలు ఊహించని అద్భుతాలు మన లైఫ్ లో జరుగుతాయి, అవి నిజమైనప్పుడు ఎలా రియాక్ట్ అవ్వాలో కూడా అర్థం కాదు. నా సిట్యుయేషన్ కూడా ప్రెజెంట్ అలాగే ఉంది" అని వైభవ్ ఎమోషనల్ గా చెప్పాడు. ఈ సిరీస్ లో వైభవ్ సూర్యవంశీకి నంబర్ 3 జెర్సీని కేటాయించారు. గతంలో ఇండియా లెజెండ్స్ అయిన హర్భజన్ సింగ్, సురేష్ రైనా లాంటి స్టార్స్ ఈ నంబర్ జెర్సీతోనే మైదానంలో అదరగొట్టారు. ప్రొఫెషనల్ కెరీర్ స్టార్టింగ్‌లో నంబర్ 12 జెర్సీ వేసుకున్న వైభవ్, తన తల్లి సలహా మేరకే నంబర్ 3 కి చేంజ్ అయ్యాడు. 12 లో ఉన్న అంకెలను ప్లస్ చేస్తే (1ం2) మూడు వస్తుందని, అలాంటప్పుడు డైరెక్ట్‌గా నంబర్ 3 ఎందుకు తీసుకోకూడదు అని అతని తల్లి చెప్పిన మ్యాథ్స్ ఈక్వేషన్ వైభవ్‌కు బాగా లక్ కలిసి వచ్చేలా చేసింది. ఐపీఎల్ లో రికార్డ్ రన్స్ తో ఆరెంజ్ క్యాప్ గెలిచిన ఈ యంగ్ ఓపెనర్, అదే నంబర్ 3 జెర్సీతో ఇండియా సీనియర్ టీమ్ లో సత్తా చాటాలని చూస్తున్నాడు. ఇండియా సీనియర్ టీ20 స్క్వాడ్‌లోకి ఎంట్రీ దక్కినప్పటికీ, ప్లేయింగ్ ఎలెవన్ లో ఓపెనర్‌గా గ్రౌండ్ లోకి దిగడం వైభవ్‌కు అంత ఈజీ కాదు. ఎందుకంటే ఓపెనింగ్ స్లాట్స్ కోసం టీమ్ లో ఆల్రెడీ సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ లాంటి సీనియర్ డ్యాషింగ్ బ్యాటర్లతో భారీ కాంపిటీషన్ ఉంది. ఐర్లాండ్‌తో జరిగే ఫస్ట్ మ్యాచ్ లో మేనేజ్‌మెంట్ వైభవ్‌కు డెబ్యూ క్యాప్ ఇస్తే, సచిన్ టెండూల్కర్ రికార్డును బ్రేక్ చేస్తూ ఇండియా తరపున ఇంటర్నేషనల్ క్రికెట్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేస్తాడు. ఈ వండర్ కిడ్ ఇంటర్నేషనల్ ఎంట్రీ కోసం ఇండియా అంతా చాలా ఈగర్‌గా వెయిట్ చేస్తోందని క్రికెట్ అనలిస్ట్ స్పష్టం చేశాడు.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి రిషభ్ పంత్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ హిస్టరీలోనే మోస్ట్ సెన్సేషనల్ ప్లేయర్ ట్రేడింగ్ అఫీషియల్ గా కన్ఫర్మ్ అయింది. లక్నో సూపర్ జాయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ మళ్లీ తన పాత ఫ్రాంచైజీ అయిన ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రీ–ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ క్రేజీ ట్రేడ్‌కు ఐపీఎల్ గవర్నింగ్ బాడీ జూన్ 23 మంగళవారం అఫీషియల్ మీడియా స్టేట్‌మెంట్ ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. "లక్నో సూపర్ జాయింట్స్ మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ లోకి వస్తున్నాడు, అతని ప్లేస్ లో చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జాయింట్స్ లో జాయిన్ కానున్నాడు" అని ఐపీఎల్ మేనేజ్మెంట్ తెలిపింది. ఈ మెగా డీల్ ఐపీఎల్ సర్కిల్స్ లో ఒక బిగ్గెస్ట్ ఎన్‌కౌంటర్‌గా మారింది. ఈ ట్రేడింగ్ లో రిషభ్ పంత్‌కు భారీగా శాలరీ కట్ (పే కట్) అయింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జాయింట్స్ రికార్డ్ స్థాయిలో రూ. 27 కోట్లు పెట్టి పంత్‌ను కొనుగోలు చేసింది. ఐపీఎల్ హిస్టరీలోనే అత్యంత కాస్ట్లీ ప్లేయర్‌గా నిలిచిన పంత్, ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ లోకి రావడం కోసం ఏకంగా రూ. 12 కోట్లు వదులుకున్నాడు. కేవలం రూ. 15 కోట్ల రివైజ్డ్ ప్రైస్ తోనే పంత్ ఢిల్లీ జెర్సీ వేసుకోబోతున్నాడు. మరోవైపు కుల్దీప్ యాదవ్ తన ప్రెజెంట్ శాలరీ అయిన రూ. 13.50 కోట్ల సేమ్ ఫీజ్‌తోనే లక్నో సూపర్ జాయింట్స్ లోకి వెళ్తున్నాడు. పంత్ శాలరీ గ్రాఫ్ ఈ రేంజ్ లో పడిపోవడం క్రికెట్ ఫ్యాన్స్ ను బాగా షాక్ కు గురిచేసింది. గత రెండు సీజన్లుగా ఐపీఎల్ లో రిషభ్ పంత్ పర్ఫార్మెన్స్ అస్సలు బాలేదు. లక్నో సూపర్ జాయింట్స్ రూ. 27 కోట్లు పెట్టినా పంత్ ఆ రేంజ్ ఇంపాక్ట్ చూపించలేకపోయాడు. లాస్ట్ రెండు సీజన్లలో కలిపి 28 ఇన్నింగ్స్ ఆడిన పంత్, కేవలం మూడు సార్లు మాత్రమే యాభై కంటే ఎక్కువ రన్స్ స్కోర్ చేయగలిగాడు. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్ 2025 లో 24.45 యావరేజ్, 133.16 స్ట్రైక్ రేట్‌తో కేవలం 269 రన్స్ మాత్రమే చేశాడు. 2026 సీజన్ లో కూడా పరిస్థితి పెద్దగా మారలేదు. 28.36 యావరేజ్, 138.05 స్ట్రైక్ రేట్‌తో 312 రన్స్ మాత్రమే స్కోర్ చేశాడు. బ్యాటింగ్ లోనే కాకుండా కెప్టెన్సీ లోనూ ఘోరంగా ఫెయిల్ అయ్యాడు. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన వెంటనే లక్నో కెప్టెన్సీ నుంచి పంత్ తప్పుకున్నాడు. అయితే మేనేజ్‌మెంట్‌తో వచ్చిన గొడవల వల్లే అతన్ని కెప్టెన్సీ నుంచి సాక్ చేశారనే టాక్ కూడా గట్టిగా నడిచింది. పంత్ బ్యాడ్ ఫామ్ వల్లే లక్నో అతన్ని వదిలించుకోవాలని చూసింది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609